*Ek Aur Zindagi (Telugu)*

# మరో జీవితం

రచన :
**డాక్టర్ సమిఉజ్జమ**

అనువాదం :
**ముహమ్మద్ ముజాహిద్**

ప్రకాశకులు
**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
**సందేశ భవనం, లక్కడ్‌కోట్,**
**ఛత్తాబజార్, హైదరాబాద్ – 500 002**

# *Maro Jeevitham*

## *Source : Ek Aur Zindagi (Urdu)*

TIP Series : 343

Written by : Dr. Sami Uzzama

Telugu Translation by : Mohammad Mujahid

*All Rights Reserved with Publishers*

First Edition : January 2023

Copies : 2000

Price : **Rs.40/-**

ISBN : 978-93-81111-94-9

Publishers : **Telugu Islamic Publications Trust**
Sandesha Bhavanam, Lakkadkote
Chatta Bazar, Hyderabad-500 002
Ph.040-24576237, 24564583
e-mail : geeturaiweekly@gmail.com

Printed at : **Cosmic Printers**
Lakkadkote, Chatta Bazar
Hyderabad - 500 002

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

# 1. మరో జీవితం

నాదొక ప్రశ్న, ఈ జీవిత ప్రయాణం ముగిసిన తరువాత (చనిపోయాక) మరో జీవితం ఉందంటారా?

మృత్యువు ఎదురైనప్పుడు దీని జవాబు వెతుక్కోవడం కాదు, ఈ రోజే తెలుసుకోవాలి.

జవాబు వెతుక్కునే సమయం అప్పుడు దొరకదు. ఒకవేళ సమాధానం దొరికినా ప్రయోజనమేమీ ఉండదు. మరణాన్ని వాయిదా వేసి రాబోయే కొత్త జీవితానికి సిద్ధమయ్యే తీరిక ఉండదు.

మీరు ఎక్కడికైనా దూర ప్రయాణం చేయాలనుకుంటే ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకుంటారు కదా? అక్కడ మీకు అవసరమైన దుస్తులు, వస్తువులు, ఆహారం అన్నీ సమకూర్చుకుంటారు. మనం ఈ ఘడియలో శ్వాస తీసుకుంటున్న జీవితం నుంచి మరో జీవితం వైపు ప్రయాణించడం అత్యంత అద్భుతమైన విషయం. కానీ ఈ విషయంలో మనకెలాంటి అవగాహన లేదు, నమ్మకమూ లేదు, ఇందుకోసం సంసిద్ధతా లేదు.

కొంతమంది దీనికోసం సమాయత్తమవుతున్నారు. మరికొంత మందికి రాబోయే కొత్త జీవితంపై నమ్మకమే లేదు. చూద్దాం లే అనే ధోరణితో ముందుకెళతారు. ఇంకొందరు అవగాహన రాహిత్యంతో సిద్ధమవుతున్నారు.

మరో జీవితమనేది లేకపోయినప్పటికీ ఇందుకోసం సంసిద్ధులయ్యే వారి కెలాంటి నష్టమూ లేదు. చనిపోయాక మట్టిలో కలిసిపోతారు. ఒకవేళ ఖచ్చితంగా మరో జీవితమనేదే ఉందనుకోండి, ఇందుకోసం సిద్ధమవ్వని వారు తీవ్ర నష్టాన్ని చవిచూస్తారు.

నా దగ్గర సృష్టికర్త పంపిన దైవగ్రంథం ఖుర్‌ఆన్ ఉంది. మనిషి మరణించాక మరో జీవితం ఉందనే సత్యాన్ని పలు ఉపమానాల ద్వారా ఖుర్‌ఆన్‌లో వివరించాడు అల్లాహ్. ఇదే వాస్తవ, శాశ్వత జీవితం. ఇది ఎప్పటికీ అంతం కాని జీవితం. ప్రస్తుత జీవితం కొన్ని రోజుల పరీక్ష మాత్రమే. రాబోయే కొత్త జీవితంలో విజయావకాశమన్నది ప్రస్తుత జీవితంలో మనం చేసుకునే సంసిద్ధతపైన ఆధారపడి ఉంది.

నేను రాబోయే జీవితంలో విజయం సాధించడానికి సిద్ధమవుతున్నాను. ఈ ప్రపంచంలో ఉన్న వారంతా నా సోదరి, సోదరులు. వారిని నేనెంతగానో ప్రేమిస్తాను. వారందరికీ మరణానంతర జీవితంలో విజయానికి కావాల్సిన మార్గాన్ని చూపి, అక్కడి వైఫల్యాల నుండి కాపాడతాను.

ఖుర్‌ఆన్ ద్వారా దేవుడు మనిషికి వివిధ బోధనలు చేశాడు. నా దగ్గరున్న ఈ ఖుర్‌ఆన్‌లోని బోధనలను మీకు తెలుపుతున్నాను. మీరు ఈ గ్రంథాన్ని చదివి మీ జీవితంలో ముందుకు వెళతారని ఆశిస్తున్నాను.

మీ మేలు కోరే మీ సోదరుడు.

**డా॥ సమిఉజ్జమ**

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

# 2. మరో జీవితం సాధ్యమా?

నా ప్రియ సోదరి, సోదరుడా!

ఈ జీవితం ముగిశాక మరో జీవితం ఉందనే వాస్తవాన్ని వెనుకటి లేఖలో చెప్పాను. ఇది సాధ్యమా అని మీరు ఆశ్చర్యపోవచ్చు. మనిషి ప్రాణం పోయాక, మట్టిలో కలిసిపోయాక, మంటల్లో కాలి బూడిదయ్యాక, మృతదేహాన్ని మరేవైనా పశు పక్ష్యాదులు, క్రూర మృగాలు తిన్నాక, సముద్రంలో కలిసి పోయాక మళ్ళీ ఎలా బ్రతకగలడు?

దీనికి నేనెలాంటి ఆధారమూ ఇవ్వలేను, దేవుడు చెప్పే మాటల్లో ఉన్నంత ప్రభావం నా మాటల్లో ఉండదు గనుక. ఇవి నన్ను, మిమ్మల్ని, సమస్త సృష్టిని సృష్టించిన సృష్టికర్త, యజమాని మాటలు. ఈ మాటలు ఆ ప్రభువు గ్రంథంలో నుంచి తీసుకోబడ్డవి. ఈ గ్రంథం ప్రస్తుతం ఏ జాతి హస్తగతమై ఉందన్న విషయాన్ని చూడకండి. ఇందులో చెప్పే మాటలు ఎంత సత్యవంతమైనవో చూడండి. మనిషి జీవిత పరమార్థం, సృష్టి సత్యాలను గురించి మానవాళికి వివరిస్తుంది. జీవితంలో ఒక్క సారైనా ఈ పుస్తకంలో చెప్పిన విషయాల గురించి యోచించడం మనందరి కర్తవ్యం. మనిషి చనిపోయాక తిరిగి బ్రతికించే, మరో జీవితాన్ని ప్రసాదించే విషయాలను గురించి పలు విధాలుగా వివరించాడు. రండి, దీని గురించి చింతన చేద్దాం.

మేము మానవుడిని వీర్య బిందువుతో సృజించిన విషయం అతను చూడటం లేదా? అయినా అతడు బహిరంగ ప్రత్యర్థిగా నిలబడ్డాడు. ఇప్పుడు అతడు మాకు పోలికలు కల్పిస్తున్నాడు, తన పుట్టుకనే మరిచిపోతున్నాడు. పైగా, శిథిలమైపోయిన ఈ ఎముకలకు తిరిగి ఎవరు జీవం పోస్తారు? అని వాదిస్తున్నాడు. అతడికి ఇలా చెప్పు, "మొదట వాటిని సృష్టించిన వాడే మళ్ళీ వాటికి జీవం పోస్తాడు" సృష్టికి సంబంధించిన ప్రతి విషయమూ ఆయనకు తెలుసు. *(దివ్య ఖుర్ఆన్ 36: 77-79)*

ఆకాశాలనూ భూమినీ సృష్టించగలిగిన వాడు వారిలాంటి వారిని పుట్టించ

లేడా? ఎందుకు చేయలేదు, ఆయన మహా నిపుణుడైన సృష్టికర్త అయినప్పుడు? ఆయన ఏదైనా చేయదలచుకున్నప్పుడు, దాన్ని కేవలం 'అయిపో' అని మాత్రమే ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది. ప్రతి విషయానికి సంబంధించిన సర్వాధికారాలు తన చేతిలో ఇముడ్చుకున్న ఆయన ఎంతో పరిశుద్ధుడు. ఆయన సన్నిధికే మీరంతా మరలిపోవలసి వుంది. *(దివ్య ఖుర్‌ఆన్ 36: 81–83)*

అల్లాహ్ సూచనలలో ఒక సూచన ఏమిటంటే, ఎండిపోయిన నేలపై మేము వర్షం కురిపించగానే, అది అకస్మాత్తుగా పులకించటాన్నీ, ఉబికిపోవటాన్ని నీవు గమనిస్తావు. నిశ్చయంగా ఈ మృతభూమిని బ్రతికించి లేపే దేవుడే మృతులకు కూడా ప్రాణభిక్ష పెడతాడు. నిస్సందేహంగా ఆయన ప్రతి దానిపై అధికారం కలిగి ఉన్నాడు. *(దివ్య ఖుర్‌ఆన్ 41: 39)*

ఈ ఆకాశాన్నీ, ఈ భూమినీ, వాటి మధ్య ఉన్న వస్తువులనూ మేము వినోదం కోసం సృష్టించలేదు సుమా. వాటిని మేము సత్యంతోనే సృష్టించాము. కాని వారిలో అనేకులు ఎరుగరు. వారందరూ లేపబడటానికి నిర్ణయించబడిన సమయం తీర్పు దినమే. ఆనాడు దగ్గర బంధువు అయినా సరే తన దగ్గర బంధువుకి కూడా ఎంత మాత్రం ఉపయోగపడడు. ఎవరి నుండీ వారికి ఏ సహాయమూ లభించదు. అల్లాహ్‌యే ఎవరి మీదనయినా కరుణ చూపితే తప్ప. ఆయన శక్తిమంతుడు, కరుణామయుడూను. *(దివ్య ఖుర్‌ఆన్ 44: 38–42)*

ఏ దేవుడైతే ఈ భూమినీ, ఈ ఆకాశాన్నీ సృష్టించాడో, వాటిని సృష్టించటంలో అలసిపోలేదో, ఆ దేవుడు మృతులను తప్పకుండా బ్రతికించి లేపగల శక్తిని కూడా కలిగి ఉన్నాడనే విషయం వారికి తోచటం లేదా? ఎందుకు కలిగిలేదు, నిశ్చయంగా ఆయన ప్రతి దానినీ చేయగల శక్తి సామర్థ్యాలు కలవాడు. *(దివ్య ఖుర్‌ఆన్ 46: 33)*

కరుణామయుడైన దేవుడు తన దాసుల్ని అనంతంగా ప్రేమిస్తాడన్న విషయం మీకు పై ఆధారాలు, ఆయన చెప్పే విధానాన్ని బట్టి మీకు బోధపడే ఉంటుంది. ఆయన మన కంటికి కనబడకపోయినా మన బుద్ధిజ్ఞానాల ద్వారా ఈ ఆధారాలపై యోచించాలని పిలుపునిస్తున్నాడు. సృష్టికర్త ఇచ్చిన ఈ సందేశాన్ని ప్రశాంత మనసుతో ఆలోచించడం. ఈ మాటలను విశ్వసించినందుకు ఇచ్చే బహుమతి కూడా విలువైనది. దీన్ని తిరస్కరించినవారికి ఇచ్చేశిక్ష కూడా ఘోరమైనది.

దేవుడు మనల్ని ఆచితూచి అడుగేసే, సన్మార్గాన్ని పొందే భాగ్యాన్ని ప్రసాదించుగాక. (ఆమీన్)

# 3. మరో జీవితం లేదు అని త్రోసిపుచ్చితే జరిగే నష్టం ఏమిటి?

ఈ జీవితం ముగిసాక మరో జీవితం ఉంది అన్న ప్రశ్న గురించి ఎందుకు ఆలోచించాలి? అనే ఆలోచన ఉత్పన్నం కావొచ్చు. మరో జీవితాన్ని నమ్మినా, నమ్మక పోయినా మనకు ఒరిగేదేముంది. నా ప్రియ సోదరీ, సోదరుడా! ఇదొక సిద్ధాంతానికో, మత విశ్వాసానికో, చర్చనీయాంశమైన విషయానికో పరిమితం కాదు. ఇది మన జీవిత లక్ష్యంతో ముడిపడి ఉన్న చిక్కుముడి. ఈ నమ్మకం పైనే మన యావత్తు జీవిత గెలుపు ఓటములు దాగి ఉన్నాయి. మన రాబోయే జీవితం ఎలా ఉంటుంది. మరో జీవితాన్ని నమ్మినట్లయితే అక్కడి జీవితంలో విజయం సాధించేందుకు శ్రమిస్తాము. ఒకవేళ నమ్మకుండా త్రోసిపుచ్చినట్లయితే జీవితాన్ని మనోకాంక్షలకు అనుగుణంగా గడుపుతాము. ఇప్పుడు మనకు దాని ప్రాధాన్యత గురించి తెలియదు. ఎందుకంటే మనం ఇప్పుడున్న స్థితిలో పూర్తి ఆరోగ్యంగా ఉన్నాము (ఇప్పుడే మనకు మృత్యువు రాదు అన్న ఆలోచనలో ఉన్నాము). కానీ మరణానికి సమయం సందర్భం అంటూ ఏదీ లేదు. ఎవరు ఎప్పుడు ఎక్కడ తన ప్రభువును కలుసుకోవడానికి వెళ్లిపోతారో ఎవరికీ తెలియదు. ఏమిటీ జీవితం? ఎందుకీ జీవితం? దీనికంటూ ఒక లక్ష్యం లేదా? అనే ప్రశ్నలు వేసుకోవాలి. మనం ప్రతీ చిన్న విషయంలో దాని ఉద్దేశమేమిటి? దాని పర్యవసానం ఏమిటి? అని ఆలోచిస్తాము. అందుకోసం సిద్ధమవుతాము. మరి జీవితాన్ని గురించి ఎందుకు ఆలోచించము?

నేను మిమ్మల్ని అప్రమత్తం చేయాలనుకుంటున్నాను. ఈ జీవితం కొన్ని రోజుల పరీక్ష. మనం చేసుకున్న కర్మలన్నింటి గురించి మూల్యాంకనం జరుగుతుంది. అప్పుడు మన జయాపజయాల మీద మన శాశ్వత జీవితం ఆధారపడి ఉంటుంది. శాశ్వత సుఖసౌఖ్యాలో లేక దుఃఖం, యాతనలతో కూడిన జీవితమో తెలుస్తుంది.

ఈ వాస్తవం కళ్ల ముందు ప్రత్యక్షమయ్యే ఆ రోజు ఎంతో సంక్లిష్టంగా ఉంటుంది. సిద్ధమవ్వకుండా ఆ రోజును ఎదుర్కోవడం గుండెలు పగిలేంత పనవుతుంది. తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది. ఆ రోజును గురించి దేవుడు కళ్లకు కట్టినట్లు తన గ్రంథంలో వివరిస్తున్నాడు.

అల్లాహ్‌యే సృష్టిని ప్రారంభిస్తాడు, ఆయనే దానిని తిరిగి సృష్టిస్తాడు, తరువాత ఆయన వైపునకే మీరు మరలింపబడతారు. ఆ గడియ నెలకొన్ననాడు, అపరాధులు దిగ్భ్రమకు లోనవుతారు. *(దివ్య ఖుర్‌ఆన్ 30:11,12)*

తన కర్మల పత్రం తన ఎడమ చేతికి ఇవ్వబడిన వ్యక్తి ఇలా వాపోతాడు, "అయ్యో! నా కర్మల పత్రం నాకు అసలు ఇవ్వకుండా ఉంటే, నా లెక్క ఏమిటో నాకు అసలు తెలియకుండా ఉంటే ఎంత బాగుండేది! అయ్యో! నాకు (ప్రపంచంలో వచ్చిన) ఆ మరణమే ఏకంగా అంతిమ మరణమై ఉంటే ఎంత బాగుండేది! ఈనాడు నా ఆస్తి నాకు ఏ మాత్రం పనికి రాలేదే. నా అధికారమంతా అంతరించిపోయిందే.

*(దివ్య ఖుర్‌ఆన్ 9: 25-29)*

వారు ఈనాడు ఇలా అంటారు : "జీవితం అంటే కేవలం ఇహలోక జీవితమే. మరణం తరువాత మనం మళ్ళీ లేపబడటం అనేది జరగదు." వారు తమ ప్రభువు ముందు నిలబెట్టబడే దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుండును! అప్పుడు వారి ప్రభువు వారిని "ఇదంతా యథార్థం కాదా?" అని అడుగుతాడు. వారు ఇలా అంటారు: "అవును మా ప్రభూ! ఇదంతా యథార్థమే!" అప్పుడు ఆయన ఇలా సెలవిస్తాడు : "సరే, అయితే మీరు యథార్థాన్ని తిరస్కరించిన దానికి ఫలితంగా ఇప్పుడు శిక్షను చవిచూడండి." *(దివ్య ఖుర్‌ఆన్ 6:29-30)*

ఎంతటి సంక్లిష్ట నిర్ణయాత్మక ఘడియలో మీరే చదివారుగా. మనిషి ఎంతగా నిస్సహాయుడైపోతాడు ఆ రోజున. జీవిత సంపద కరిగిపోతుంది. పరీక్ష ఘడియ ముగిసిపోతుంది. మనం ఆ రోజున ప్రభువు ముందు ఉట్టి చేతులతో నిల్చోవడం ఎంతటి విచారకరం. మనల్ని పుట్టించిన వాడి ముందు సిగ్గుపడకుండా, ఆ మహా కష్టం నుండి కాపాడబడాలని నేను, మీరు కోరుకోవద్దా. ఈ ప్రపంచంలోకి తిరిగి పంపబడటమనేది జరగదు. సత్యాన్ని తెలుసుకుని, దాన్ని ఆచరించి, అందుకోసం సిద్ధమవడం మన విధి కాదా?

కాసేపు మనసుపెట్టి ఆలోచించండి. నేను, మీరు దీనిపై శ్రద్ధగా ఆలోచించాలి. మనందరి జీవిత సవాలు ఇది.

దేవుడు మనందరికీ మేలు చేయుగాక.

# 4. రాబోయే జీవితమే అసలైన జీవితం

నా ప్రియ సోదరి, సోదరుడా!

మరో లేఖతో మీ ముందు హాజరయ్యాను. ఈ జీవితం ముగిసాక రాబోయే కొత్త జీవితమే అసలైన జీవితమన్న విషయం మీకు తెలియజేయాలనుకుంటున్నాను. వేల, కోట్ల సంవత్సరాలుండే శాశ్వతమైన జీవితం అది. ప్రస్తుత జీవితం కొంత వ్యవధి మాత్రమే. నలభై, యాభై ఏళ్లు లేదా డెబ్భై, ఎనభై సంవత్సరాలు, మరీ అంటే వంద, నూట పాతికేళ్లు. ఇందులోనూ ఎవరి జీవిత ప్రయాణం ఎప్పుడు ముగుస్తుందో ఎవరి కెరుక. చిన్న పిల్లలు, నిత్య యువకులు సైతం మృత్యువాత పడే సంఘటనలు మనం చూస్తుంటాము. మరణం లేని జీవితాన్నిచ్చేందుకు దేవుడు మనల్ని పుట్టించాడు. ఆ జీవితం ఎలా ఉంటుంది (సంతోషాలతో నిండినదా? దుఃఖభరితమైనదా?) ఇక్కడి జీవితంలోనే నిర్ణయించుకోవాలి. మన బుద్ధీ వివేకాలతో దేవుడిని గుర్తించి, దైవాదేశాల కనుగుణంగా మంచి పనులు చేస్తామో, లేదా షైతాన్ ఉచ్చులో పడి వాడు చూపిన బాటలో నడుస్తామో నిర్ణయం మన చేతిలోనే ఉంది.

రాబోయే జీవితమే అసలైన జీవితం. ఈ జీవితం కొన్ని రోజుల పరీక్షా సమయం. మనల్ని పుట్టించిన వాడు ఆ రాబోయే జీవితం గురించి దైవ గ్రంథంలో గుర్తు చేస్తున్నాడు. నేను ఆ గ్రంథంలోని విషయాల అనువాదం తెలియజేస్తాను. ఈ మాటలు మన మనో ప్రపంచాన్ని మారుస్తాయని అనుకుంటున్నాను.

ఐహిక జీవిత భోగాలు అల్పమైనవి, దైవభక్తి పరాయణుడైన మనిషికి పరలోకమే ఎక్కువ మేలైనది. మీకు రవ్వంత అన్యాయం కూడా జరగదు. *(దివ్య ఖుర్ఆన్ 4:77)*

నరకాగ్ని నుండి కాపాడబడి, స్వర్గంలో ప్రవేశపెట్టబడేవాడు మాత్రమే యథార్థా నికి సఫలీకృతుడు. ఇక ఈ ప్రపంచం, అది కేవలం మాయావస్తువు మాత్రమే.

*(దివ్య ఖుర్ఆన్ 3:185)*

అల్లాహ్‌తో తమ సమావేశపు వర్తమానాన్ని అబద్ధంగా పరిగణించిన వారు నష్టానికి గురి అయ్యారు. అకస్మాత్తుగా ఆ గడియ వచ్చిపడినప్పుడు వారే వాపోతారు: "అయ్యో! ఈ విషయంలో మేము ఎంత పొరపాటు చేశాము!" అని. వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే, తమ పాపాల బరువును తమ వీపులపై మోస్తూ ఉంటారు. చూడండి! వారు మోస్తూవున్న ఈ బరువు ఎంత చెడ్డదో! ఇహలోక జీవితం ఒక ఆట, ఒక తమాషా మాత్రమే. వాస్తవానికి నష్టం నుండి తప్పించుకొనగోరే వారికి పరలోకవాసమే అత్యంత శ్రేష్ఠమైనది. అయితే మీరు బుద్ధిని ఉపయోగించరా?

*(దివ్య ఖుర్ఆన్ 6:31-32)*

మనం ఎక్కడి నుండి వచ్చామో ఎక్కడికెళ్లాలో ప్రశాంత మనస్సుతో ఆలోచించాలి. ప్రతీ చిన్న సమస్య పరిష్కారం కోసం ఎంతో ఆచితూచి అడుగేసే మనం జీవిత లక్ష్యం గురించి ఎందుకు ఆలోచించము?

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

# 5. మన జీవితం స్వల్ప పరీక్షా వ్యవధి

నా ప్రియ సోదరి, సోదరుడా!

నేను, మీరు ఈ ప్రాపంచిక జీవితమే సర్వస్వమని అనుకుంటే, ధర్మబద్ధంగానో, అధర్మంగానో ప్రపంచాన్ని పొందడమే విజయమనుకుంటే మన ఆచరణా ధోరణి భిన్నంగా ఉంటుంది. కానీ ఈ జీవితాన్ని పరీక్షగా భావిస్తే మన వైఖరి వేరుగా ఉంటుంది. దైవప్రవక్తలంతా, దేవుని చివరి గ్రంథమూ ఈ ప్రాపంచిక జీవితం స్వల్ప పరీక్ష వ్యవధి మాత్రమేనని ఘోషిస్తున్నాయి. ఈ పరీక్ష మీదనే రాబోయే శాశ్వత జీవితం ఆధారపడి ఉంది. ఈ సత్యాన్ని తెలుసుకోకుంటే జీవితం నిర్లక్ష్యంగా గడిచిపోతుంది. ఉన్నపళంగా మృత్యువు కబళిస్తుంది. మనల్ని పుట్టించిన ఆ సృష్టికర్త దైవగ్రంథంలో హెచ్చరిస్తున్నాడు:

ప్రజలారా! మీరు చేసే ఈ తిరుగుబాటు మీకే హాని కలిగిస్తుంది. ఇహలోక జీవిత సుఖాలు కొన్ని రోజుల సుఖాలు మాత్రమే (వాటిని అనుభవించండి). తరువాత మా వైపునకే మీరు మరలిరావలసి ఉన్నది. అప్పుడు మేము మీకు తెలుపుతాము, మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో. ఈ ప్రాపంచిక జీవితాన్ని (దాని నిషాలోపడి మీరు మా సూచనల పట్ల అశ్రద్ధ వహిస్తున్నారు) ఇలా పోల్చవచ్చు– మేము ఆకాశం నుండి నీటిని కురిపించగా మనుషులూ పశువులూ అందరూ తినే భూఉత్పత్తులు బాగా దట్టంగా తయారయ్యాయి. ఆపై భూమి మంచి స్థితిలో ఉన్నప్పుడు పొలాలు బాగా పండి శోభిల్లుతూ ఉన్నప్పుడు వాటి యజమానులు, "ఇక మేము వాటివల్ల లాభం పొందగలము" అని అనుకుంటున్న సమయంలో, అకస్మాత్తుగా రాత్రి వేళనో పగటిపూటనో మా ఆజ్ఞ వచ్చేసింది. అప్పుడు మేము అసలు అక్కడ నిన్న ఏమీ లేనట్లు దానిని సర్వనాశనం చేశాము. ఇలా మేము మా సూచనలను స్పష్టంగా వివరిస్తాము.

(దివ్య ఖుర్ఆన్ 10:23–24)

భూమిపై ఉన్న వస్తు సామగ్రినంతటినీ మేము భూమికి అలంకారంగా చేశాము. చివరకు మేము దీనినంతటినీ చదునైన మైదానంగా చేసివేయనున్నాము.

(దివ్య ఖుర్‌ఆన్ 18:7–8)

మీరు పరలోకానికి మారుగా ప్రాపంచిక జీవితాన్ని కోరుకున్నారా? అలా అయితే మీరు తెలుసుకోవాలి, ప్రాపంచిక జీవితపు సకల సామగ్రి పరలోక సుఖాల ముందు స్వల్పాతి స్వల్పమైనదిగా తేలుతుందని. (దివ్యఖుర్‌ఆన్ 9:38)

అల్లాహ్ తన ఇష్టప్రకారం కొందరికి ఎక్కువ జీవనోపాధిని ప్రసాదిస్తాడు, మరికొందరికి తక్కువ జీవనోపాధిని ప్రసాదిస్తాడు. వారు ప్రాపంచిక జీవితంలో మునిగిపోయి ఉన్నారు. వాస్తవానికి పరలోకం ముందు ప్రాపంచిక జీవితం ఒక చిరు సంపద తప్ప మరేమీ కాదు. (దివ్య ఖుర్‌ఆన్ 13:26)

మనం శ్వాస తీసుకుంటున్న ఈ జీవిత ఘడియలు స్వల్పమైనవి. రాబోయే శాశ్వతమైన జీవితంలో జయాపజయాల కోసం ఈ జీవితంలో కర్మలు చేస్తున్నాము. ఈ సత్యాన్ని తెలుసుకోకుండా మనం జీవితాన్ని ఏమరుపాటులో గడుపుదామా? లేదంటే సత్యాన్ని అన్వేషించి దానికనుగుణంగా ప్రణాళికబద్ధంగా జీవితాన్ని గడుపుదామా? ఈ నిర్ణయం మన చేతుల్లోనే ఉంది. ఫలితం మన ముందుంటుంది. ఆ ఘడియలో మనకు కర్మలు చేసుకునే అవకాశం ఏ మాత్రం దొరకదు. ఆలోచించండి. చింతన చేయండి.

# 6. ఎప్పటికీ అంతం కాని హాయి జీవితం

నాకేదైన మేలు జరిగే, ప్రయోజనం చేకూరే కబురు అందితే నేను దాని ద్వారా లబ్ది పొందడమే కాక నా సన్నిహితులందరికీ లబ్ది చేకూరేలా ప్రయత్నిస్తాను. ఇది మానవ నైజం. నేను ఎప్పటికీ అంతంకాని సంతోషాలను అనుభవించే పరలోక జీవిత విశేషాల గురించి తెలుసుకున్నాను. దాన్ని అనుభవించాలన్న కోరిక నాలో కలగడమే కాకుండా, ఈ అంతం కాని అనుగ్రహ భాగ్యాల గురించి నా అన్నా, చెల్లెళ్లకు తెలియజేయకుండా ఎలా ఉండగలను? ఆ గొప్ప శుభవార్త గురించి, అక్కడి సౌఖ్యాలు పొందాలనే ఆసక్తిని మీలో పెంచేందుకు, మీతో కొన్ని విషయాలు పంచుకోవాలనుకుంటున్నాను. పరలోక జీవితపు ఆనవాళ్లను దైవ గ్రంథం మన ముందుంచింది. మన సృష్టికర్త, యజమాని పరలోక జీవితాన్ని పొందాలనే కోరికను ప్రేరేపిస్తున్నాడు. ఎందుకంటే దీన్ని సాధించడమే అసలైన విజయం. నేను నా సొంత మాటలకు బదులుగా దైవ వాక్కులను వివరిస్తాను. అది ఎంతటి ఘనమైన విజయమో తెలుసుకోవచ్చు. మన ఆలోచనలు, మన కలలకు అందని బ్యూటీఫుల్ లైఫ్ అది.

భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం యొక్క వైభవం ఇలా ఉంది, అందులో నిర్మలమైన నీటి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, ఏ మాత్రమూ మారని రుచిగల పాల కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, సేవించే వారికి మధురంగా ఉండే మద్యపు కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, స్వచ్ఛమైన తేనె కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అందులో వారి కొరకు అన్ని రకాల పండ్లు ఉంటాయి. ఇంకా వారి ప్రభువు తరఫు నుండి క్షమాభిక్ష కూడ. (ఇలాంటి స్వర్గాన్ని తన వంతు భాగంగా పొందనున్న వ్యక్తి) నరకంలో శాశ్వతంగా ఉండిపోయే వారి మాదిరిగా పేగులను సైతం కోసివేసేటటువంటి సలసల కాగే నీరు ఇవ్వబడేవారి మాదిరిగా కాగలడా?

*(ఖుర్‌ఆన్ 47:15)*

ప్రవక్తా! ఈ గ్రంథాన్ని విశ్వసించి, (దాని బోధనలకు అనుగుణంగా) తమ నడవడికను తీర్చిదిద్దుకునే వారికి సంతోష వార్త వినిపించు : కాలువలు ప్రవహించే ఉద్యానవనాలు వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి అని. ఆ వనాలలోని పండ్లు ఆకారంలో భూలోకంలోని పండ్లను పోలి ఉంటాయి. తినటానికి ఏమైనా పండ్లు ఇవ్వబడినప్పుడల్లా, వారు “ఇలాంటి పండ్లే పూర్వం భూలోకంలో మాకు ఇవ్వబడేవి” అని అంటారు. అక్కడ వారి కొరకు పవిత్రలైన భార్యలు ఉంటారు. వారు అక్కడే శాశ్వతంగా ఉంటారు. *(దివ్యఖుర్ఆన్ 2:25)*

శాశ్వతంగా ఉండే ఉద్యాన వనాలలోకి వారు ప్రవేశిస్తారు. అక్కడ వారిని సువర్ణ కంకణాలతో, ముత్యాలతో అలంకరించటం జరుగుతుంది. అక్కడ వారు పట్టు వస్త్రాలు ధరిస్తారు. ఇలా అంటారు, “అల్లాహ్‌కు కృతజ్ఞతలు. ఆయన మా దుఃఖాన్ని తొలగించాడు. నిశ్చయంగా మా ప్రభువు క్షమించేవాడూ, విలువ ఇచ్చేవాడూను. ఆయన మమ్మల్ని తన అనుగ్రహం వల్ల శాశ్వత నివాస స్థలంలో నివసింపజేశాడు. ఇక ఇక్కడ మాకు ఏ కష్టమూ ఉండదు, ఏ అలసటా కలుగదు.” *(దివ్యఖుర్ఆన్ 35: 33–35)*

సజ్జనులు (స్వర్గంలో) కర్పూర జలం కలిపిన మధుపాత్రలను సేవిస్తారు; ఇది ప్రవహించే ఒక సెలయేరు; దైవదాసులు దాని నీటితోపాటు మద్యం సేవిస్తారు. వారు తాము కోరిన చోటికి దాని పాయలను సులభంగా తీసుకుపోతారు. వారు ఎలాంటి వారంటే, (ప్రపంచంలో) మొక్కుబడి చెల్లించేవారు, నలువైపుల నుండి ఆపదలు కమ్ముకొనివచ్చే దినానికి భయపడేవారు మరియు అల్లాహ్ మీది ప్రేమతో పేదలకూ, అనాథులకూ, ఖైదీలకూ అన్నం పెట్టేవారు. (వారు వారితో ఇలా అంటారు), “మేము కేవలం అల్లాహ్ కోసమే మీకు అన్నం పెడుతున్నాము. మేము మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్నిగానీ, కృతజ్ఞతలను గానీ ఆశించటం లేదు. దుర్భర మైన ఆపదలతో కూడుకున్న సుదీర్ఘమైన రోజున మా ప్రభువు విధించే శిక్ష గురించి మేము భయపడుతున్నాము.” కనుక అల్లాహ్ వారిని ఆనాటి కీడు నుండి రక్షిస్తాడు, వారికి తాజాదనాన్నీ, ఆనందాన్నీ ప్రసాదిస్తాడు. వారి సహనానికి ప్రతిఫలంగా వారికి స్వర్గాన్నీ, పట్టువస్త్రాలనూ ప్రసాదిస్తాడు. అక్కడ వారు ఎత్తైన పీఠాలపై దిండ్లకు ఆనుకుని కూర్చొని ఉంటారు. వారిని ఎండ వేడీ బాధించదు. చలి తీవ్రతా వేధించదు. స్వర్గచ్ఛాయలు వారిపైకి వంగి నీడను ఇస్తూ ఉంటాయి, దాని పండ్లు ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటాయి (వారు తమ ఇష్టానుసారం వాటిని తెంచుకొని

తింటారు). వారి మధ్య వెండి పాత్రలు, గాజుగ్లాసులు అటూ ఇటూ త్రిప్పబడుతూ ఉంటాయి; ఆ గాజుగ్లాసులు స్ఫటికం వలె తెల్లనైన వెండితో చేయబడినటువంటివి. వాటిని (స్వర్గ నిర్వాహకులు) కచ్చితమైన అంచనా ప్రకారం నింపి ఉంటారు. అక్కడ వారికి సొంటి కలిపిన మధుపాత్రలు ఇవ్వబడతాయి; ఇది స్వర్గంలోని 'సల్ సబీల్' అనే పేరుగల ఒక సెలయేరు. వారి సేవకొరకు పరుగెత్తుతూ అటూ ఇటూ తిరిగే బాలురు ఉంటారు; వారు ఎల్లప్పుడూ బాలురుగానే ఉంటారు. మీరు వారిని చూస్తే, వెదజల్లబడిన ఆణిముత్యాలా అని అనుకుంటారు. అక్కడ మీరు ఎటు చూచినా దైవానుగ్రహాలే మీకు కనిపిస్తాయి; ఇంకా ఒక మహత్తర సామ్రాజ్య వైభవం కనిపిస్తుంది. వారి ఒంటిపై సన్నని ఆకుపచ్చని పట్టు వస్త్రాలు, ఖరీదైన జలతారు అల్లిన దుస్తులు ఉంటాయి. వారికి వెండి మురుగులు తొడుగుతారు. వారి ప్రభువు వారికి ఎంతో పరిశుద్ధమైన మద్యాన్ని ప్రసాదిస్తాడు. మీకు లభించే ప్రతిఫలం ఇది; మీరు చేసిన పనులు విలువైనవిగా గుర్తించబడ్డాయి. *(దివ్యఖుర్ఆన్ 76: 5-22)*

మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు, స్వర్గం వైపునకు పోయే మార్గంలో పరుగెత్తండి. ఆ స్వర్గం భూమ్యాకాశాల అంత విశాలమయింది. అది భయభక్తులు కలవారి కొరకు తయారు చెయ్యబడింది. *(దివ్యఖుర్ఆన్ 3:133)*

ఆ అందమైన జీవితం గురించి, అందులో లభించే సౌఖ్యాలు, అనుగ్రహాల గురించి దైవగ్రంథ వివరణలు చదివారుగా. ఈ అనుగ్రహ భాగ్యాలను సృష్టించడం ఆ దైవానికి ఏమంత కష్టతరమైన పని కాదు. ఆయనే ఈ విశ్వ కర్మాగారాన్ని సృష్టించాడు. ఆయన తన దాసుల కోసం అనుగ్రహాలను సృష్టించాడు. ఈ అనుగ్రహాలను చూడకుండా విశ్వసించాలన్నది షరతు. ఆ స్వర్గ సౌఖ్యాలను చూడకుండా విశ్వసించాలి. ఆయన ఆదేశాలకు అనుగుణంగా జీవితాన్ని గడపాలి. వేలాది దైవ ప్రవక్తలు ఇదే సందేశాన్ని అందించారు. ఈ వివరాలన్నీ ఆయన పంపిన దైవ గ్రంథంలో భద్రంగా ఉన్నాయి.

ఈ మహా శుభవార్త గురించి నాకు తెలిసినప్పుడు నా తోటి సోదరి, సోదరులకు తెలియజేయాల్సిన బాధ్యత నా మీద ఉండదా? నేను చెప్పిన ఈ విషయాల గురించి యోచించాల్సిన బాధ్యత మీపైనా ఉంది. నేను, మీరు ఈ విషయాలను కట్టుకథలని కొట్టిపారేసి నిర్లక్ష్యంగా జీవితం గడిపి తీవ్ర నష్టాన్ని ఎదుర్కొందామా?

# 7. ఎంత భయానకం ఆ ప్రదేశం

దేవుడు మనకు ఏయే వరప్రసాదాలు ఇచ్చి ఈ ప్రపంచంలో పంపాడో మీరెప్పుడైనా ఆలోచించారా? పుట్టకముందే తల్లి ఛాతిలో పాలు ఏర్పాటు చేశాడు. తల్లిదండ్రుల హృదయాల్లో మన పట్ల ప్రేమను నాటాడు. చూడటానికి కళ్లు ఇచ్చాడు. కాళ్లు, చేతులిచ్చాడు. బుద్ధీ జ్ఞానాలను ప్రసాదించాడు. ఈ బుద్ధీ జ్ఞానాలను ఉపయోగించి దేవుడిని గుర్తించాలి. పవిత్రమైన జీవితం గడపాలి. మన మార్గదర్శకత్వం కోసం ప్రవక్తలను పంపాడు. దైవ గ్రంథాలను పంపాడు. మనకు అనుగ్రహించిన ఈ వర ప్రసాదాలను గుర్తించకుండా, దుర్వినియోగం చేసి, కన్నవాళ్లను కష్టపెట్టి వారిని వదిలేసి, తోటివారిపై దౌర్జన్యానికి దిగి, అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడితే దైవం వీటిని పట్టించుకోకుండా చూస్తూ ఊరుకుంటాడా? దేవుడు ఈ లోకాన్ని సృష్టించి దాని మానాన అలా వదిలేశాడనుకుంటున్నారా? ప్రపంచంలో జరిగే వాటి గురించి ఆయనకు తెలియదనుకుంటున్నారా? మంచి పనులు చేసేవారికి బహుమానం, దుర్మార్గాలకు పాల్పడే వారికి శిక్ష లేదనుకుంటున్నారా? జీవితంలో సన్మార్గాన్ని ఆచరించి దుర్భరమైన కష్టాలు భరించిన వారికి ఎలాంటి ప్రతిఫలమూ ఉండదనుకుంటున్నారా? దైవదాస్యం చేయకుండా ఇష్టారీతిన జీవితాన్ని గడిపి అమానుషాలకు, అకృత్యాలకు పాల్పడిన వారికెలాంటి శిక్ష లేదనుకుంటున్నారా? శిక్షా బహుమానాలన్నవి ముమ్మాటికీ ఉండితీరుతాయి. దుర్మార్గులకు తగిన శిక్ష సిద్ధంగా ఉంది. వారు చేసిన పాపకార్యాలకు తప్పకుండా శిక్ష అనుభవిస్తారు. ఇలాంటి వారి కోసం నరకాన్ని సిద్ధం చేసి ఉంచాడు. నరకాగ్ని శిక్షలు వారికోసం ఎదురు చూస్తున్నాయి. నరకాన్ని ఏర్పాటు చేయడం దేవుడికి పెద్ద కష్టమేమీ కాదు. వేలాది సంవత్సరాలుగా మండుతున్న సూర్యగోళాన్ని సృష్టించిన దైవానికి నరకాన్ని సృష్టించడం అంత కష్టమేమీ కాదు.

ఈ విషయాలను నిర్మల మనస్సుతో ఆలోచించాలన్నదే నా విజ్ఞప్తి. నాకు మీరంటే ప్రేమ. తోటి మనుషులు ఎవరి పట్లనైనా నేను ప్రేమగానే ఉంటాను. ఒక్క వేలు కూడా నరకంలో కాలిపోవడాన్ని నేను సహించలేను. నేను వృత్తి రీత్యా డాక్టర్‌ను. నా దగ్గరకు వచ్చే పేషెంట్లు ఎంత పెద్ద బలవంతులైనా వ్యాధిగ్రస్తులైతే దాని బాధను భరించలేరు. వారిలోని అమాయకత్వం బయటపడుతుంది. పసిపిల్లల్లా ఏడుస్తారు. ఆ సమయంలో పేషెంట్ పెట్టే పెడబొబ్బలు, అతని బంధువుల బాధను చూసి ఎంతగానో చలించిపోతాను. ఇక్కడి కష్టం కంటే ఎన్నో రెట్లు అధికంగా ఉండే ఆ మహా కష్టం గురించి వీళ్లకు తెలిస్తే ఎంత బావుండు అని ఆ సమయంలో ఎంతో తపన పడతాను. ఇక్కడి కష్టాన్ని, బాధ నుండి తప్పించుకునేందుకు ఎన్నో మార్గాలు వెతుక్కున్నట్లు గానే ఆ మహా యాతన నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తే ఎంత బావుండు. కాలిన వేలి బాధను ఒక్కసారి ఊహించుకోండి, నరక శిక్ష గురించి అనుభవ పూర్వకంగా తెలుస్తుంది. ఆ నరక అగ్ని నుండి దైవం మనందరినీ కాపాడుగాక!

నరకాగ్ని భయోత్పాతం గురించి ఖుర్‌ఆన్ గ్రంథంలో అల్లాహ్ చెప్పిన విషయాలు మీకు వివరిస్తాను. నరకాగ్ని నుండి కాపాడుకోవాలన్నది అల్లాహ్ హెచ్చరిక. నరక శిక్ష నుండి కాపాడుకునే మార్గాలనూ సూచించాడు. నీతి, నిజాయితీ, న్యాయం వీటికి సాధనాలు. కేవలం పీడితులపై దయచూపి స్వర్గంలో పంపడమే కాదు, దౌర్జన్యాలకు, దుర్మార్గాలకు, అక్రమాలకు పాల్పడిన వారిని నరకంలో విసిరేస్తాడు.

అవిశ్వాసానికి పాల్పడిన వారికి నరకాగ్ని ఉన్నది. వారు చనిపోవాలనే తీర్పు ఇవ్వబడదు, వారి నరక యాతనను ఏ మాత్రం తగ్గించటమూ జరుగదు. ఇలా మేము అవిశ్వాసానికి పాల్పడే ప్రతి వ్యక్తికీ ప్రతిఫలం ఇస్తాము. వారు అక్కడ పెడబొబ్బలు పెడుతూ ఇలా అంటారు, “మా ప్రభూ! మమ్మల్ని ఇక్కడ నుండి బయటకు తియ్యి, మేము పూర్వం చేసిన పనులకు భిన్నంగా మంచి పనులు చేయటానికి.” (వారికి ఇలా జవాబు ఇవ్వబడుతుంది) గుణపాఠం నేర్చుకోదలచినవాడు గుణపాఠం నేర్చుకోవటానికి సరిపడిన ఆయుష్షును మేము మీకు ఇవ్వలేదా? మీ వద్దకు హెచ్చరిక చేసేవాడు కూడా వచ్చి ఉన్నాడు కదా! ఇక రుచి చూడండి (యాతనను). దుర్మార్గులకు ఇక్కడ సహాయం చేసే వాడెవ్వడూ లేడు. (దివ్య ఖుర్‌ఆన్ 35:36,37)

ఈ ఆతిథ్యం మంచిదా లేక రాకాసి జముడు (జఖ్ఖూమ్) చెట్టు ఆతిథ్యం మంచిదా? మేము ఆ చెట్టును దుర్మార్గుల పాలిట పరీక్షగా చేశాము. అది నరకం అడుగు భాగం నుండి మొలిచే ఒక చెట్టు. దాని మొగ్గలు షైతానుల తలలు మాదిరిగా ఉంటాయి. నరకవాసులు వాటిని తింటారు. వాటితోనే కడుపు నింపుకుంటారు. అదీగాక, త్రాగటానికి వారికి సలసల కాగే నీరు లభిస్తుంది. ఆ తరువాత వారు మళ్లీ నరకాగ్ని వైపునకే తిరిగి వస్తారు. తమ తాత ముత్తాతలు మార్గభ్రష్టులవటాన్ని చూసినప్పటికీ, వారి అడుగుజాడలలోనే పరుగెత్తిన వారు వీరే. (దివ్య ఖుర్ఆన్ 37:62-70)

తమ ప్రభువును తిరస్కరించిన ప్రజలకు నరక శిక్ష పడుతుంది: అది చాలా చెడ్డ నివాస స్థలం. వారిని అందులోకి విసిరి వేసినప్పుడు, వారికి భయంకరమైన దాని గర్జన ధ్వని వినిపిస్తుంది. అది అప్పుడు ఉద్రేకంతో ఉడికిపోతూ ఉంటుంది, తీవ్రమైన ఆగ్రహంతో బ్రద్దలవుతూ ఉంటుంది. ఏదైనా ఒక గుంపును అందులో వేసిన ప్రతిసారీ, దాని కాపలాదారులు, “మీ వద్దకు హెచ్చరించేవారు రాలేదా?” అని వారిని అడుగుతారు. దానికి వారు ఇలా జవాబు ఇస్తారు, “వచ్చాడు, హెచ్చరిక చేసే అతను మా వద్దకు వచ్చాడు. కాని మేము అతనిని తిరస్కరించాము. అల్లాహ్ దేన్నీ అవతరింపజేయలేదు, నీవు మార్గభ్రష్టుడవై పోయావు అని మేము అతనితో అన్నాము.” ఇంకా వారు ఇలా అంటారు, “అయ్యో! మేము గనక (ఆనాడు) విని ఉంటే, లేదా గ్రహించి ఉంటే, ఈనాడు ఇలా మండే నరకాగ్ని శిక్షకు గురిఅయిన వారిలో చేరి ఉండేవారము కాదు కదా!” ఈ విధంగా వారే స్వయంగా తమ తప్పును ఒప్పుకుంటారు. ఈ నరకవాసులు నాశనమైపోను! (దివ్య ఖుర్ఆన్ 67:6-11)

తన కర్మల పత్రం తన ఎడమ చేతికి ఇవ్వబడిన వ్యక్తి ఇలా వాపోతాడు, “అయ్యో! నా కర్మల పత్రం నాకు అసలు ఇవ్వకుండా ఉంటే, నా లెక్క ఏమిటో నాకు అసలు తెలియకుండా ఉంటే ఎంత బాగుండేది! అయ్యో! నాకు (ప్రపంచంలో వచ్చిన) ఆ మరణమే ఏకంగా అంతిమ మరణమై ఉంటే ఎంత బాగుండేది! ఈనాడు నా ఆస్తి నాకు ఏ మాత్రం పనికి రాలేదే. నా అధికారమంతా అంతరించిపోయిందే.” (అప్పుడు ఇలా ఆజ్ఞాపించబడుతుంది) అతనిని పట్టుకోండి, అతని మెడకు కంఠపాశం తగిలించండి. ఆపై అతనిని నరకంలోకి విసిరివేయండి. తరువాత అతనిని డెబ్బై గజాల

పొడుగు గొలుసుతో బంధించండి. మహనీయుడూ, మహోన్నతుడూ అయిన అల్లాహ్‌ను ఇతను విశ్వసించేవాడు కాదు, నిరుపేదలకు అన్నం పెట్టండి అని ప్రోత్స హించే వాడూ కాదు. కనుక ఈనాడు ఇక్కడ ఇతని దుఃఖంలో పాలుపంచుకునే స్నేహితుడెవడూ ఉండడు గాయాల కడుగు తప్ప అతనికి తినటానికి ఆహారం కూడ ఏదీ ఉండదు. దానిని పాపాత్ములు తప్ప మరెవరూ తినరు.(దివ్య ఖుర్‌ఆన్ 69:25-37)

కనుక ఓ ప్రవక్తా! సహనం వహించు, హుందాతనంతో కూడిన సహనం. వారు అది దూరంగా ఉన్నదని అనుకుంటున్నారు. కాని మాకు అది దగ్గరలో కనిపిస్తున్నది. ఏ రోజున ఆకాశం కరిగిన వెండి మాదిరిగా అయిపోతుందో, కొండలు ఏకిన రంగు రంగుల ఉన్ని పింజలు మాదిరిగా అయిపోతాయో, ప్రాణస్నేహితులు ఒకరికొకరు కనిపించినప్పటికీ, ఎవరూ ఎవరిని గురించీ పట్టించుకోవటం జరగదో (ఆ రోజున ఆ శిక్ష సంభవిస్తుంది). దోషి ఆనాటి శిక్ష నుండి తప్పించుకోవటానికి తన సంతానాన్నీ, తన భార్యనూ, తన సోదరులనూ, తనకు ఆశ్రయమిచ్చిన దగ్గరి బంధువులనూ భూమండలంలోని వారందరినీ పరిహారంగా ఇచ్చి, ఈ ఉపాయం ద్వారా విముక్తి పొందాలని కోరుకుంటాడు. ఎంత మాత్రం కాదు. (అలా ఎన్నటికీ జరగదు) అది భగభగ మండే నరకాగ్ని జ్వాల. మాంసాన్ని, చర్మాన్ని సైతం అది తినేస్తుంది. సత్యం పట్ల విముఖుడై, వెన్ను చూపి, ధనాన్ని కూడబెట్టి దానిని మాటిమాటికి పేర్చి పెట్టిన ప్రతివాణ్ణీ అది బిగ్గరగా అరుస్తూ తన వైపునకు పిలుస్తుంది. (దివ్య ఖుర్‌ఆన్ 70:5-18)

ఆ నరకం ఏమిటో నీకేమి తెలుసు? అది మిగిలించదు, వదలి పెట్టదు. అది చర్మాన్ని మాడ్చివేసేది. (దివ్య ఖుర్‌ఆన్ 74: 27-29)

నా ప్రియ సోదరి, సోదరులారా,

నరక శిక్షల గురించి చదువుతుంటే మీ రోమాలు నిక్కబొడుచుకుని ఉంటాయి. నరక శిక్షల గురించి ఖుర్‌ఆన్ స్పష్టంగా వివరిస్తుంది. ఇప్పటికీ మనలో నరకం పట్ల భీతి కలగటం లేదా? నరకం ఉంది అనడానికి మీకేమైనా ఆధారాలు కావాల్నా? మరి నరకం లేదు అనడానికి ఆధారాలేమిటి? దైవగ్రంథానికి మించిన ఆధారం మనకింకేం కావాలి?

మన ఉనికే లేనప్పుడు మనల్ని ఆ దైవం సృష్టించాడు. ఇంత గొప్ప మహా విశ్వాన్ని ఉనికిలోకి తెచ్చిన ఆ దేవుడు స్వర్గ, నరకాలను సృష్టించలేడా? సూర్య, నక్షత్రాలను సృష్టించిన దేవుడికి పాపాత్ములను శిక్షించేందుకు నరకాన్ని సృష్టించడం పెద్ద కష్టమైన పనేమీ కాదు. ఈ ప్రశ్నలన్నింటికీ ఆలోచించడంలోనే మన విజ్ఞత, వివేకాలు దాగి ఉన్నాయి. మన జీవిత ప్రయాణం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియదు.

ఆ దైవం మనకు సాయపడుగాక ఆమీన్!

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

# 8. శాశ్వతమైన సంతోషానికి చిరునామా

నలభై, యాభై ఏళ్ల జీవితంలో సంతోషాల కోసం బాల్యం నుండి యవ్వనం వరకూ రాత్రింబవళ్లు విశ్వప్రయత్నాలు చేస్తాం. ఎన్నో ఉన్నత చదువులు చదువుతాం, ఏవేవో వృత్తులు నేర్చుకుంటాం. ఎంతో కష్టపడతాం. ఇందుకోసం మన అమ్మానాన్న, బంధువులు, గురువులు, మన కోసం డబ్బు, సమయాన్ని వెచ్చిస్తారు. రాత్రింబవళ్లు మన ఉన్నతి కోసం పరిశ్రమిస్తారు. అప్పుడే మనం గొప్ప ప్రయోజకులమవుతాం. కానీ ఈ జీవితం ఎన్ని రోజులు? పదేళ్లు, ఇరవై ఏళ్లు, మహా అంటే యాభై, అరవై ఏళ్లు. ఎన్నాళ్లు జీవిత సుఖాలను అనుభవిస్తామో ఎలాంటి గ్యారంటీ లేదు. ఒకవేళ బ్రతికినా ఏదో ఒక శారీరక, మానసిక రుగ్మతతో జీవితాన్ని నెట్టుకొస్తాము. ఏదో తెలియని అసంతృప్తి వెంటాడుతుంది. మనం చనిపోయాక రాబోయే శాశ్వత జీవితం కోసం ఎంతగానో పరిశ్రమించాలి.

స్వర్గాన్ని తీర్చిదిద్దిన ఆ సృష్టికర్త ఇష్టప్రకారం మన ఆచరణలుండాలి. ఆయనే మనల్ని పుట్టించాడు. ఆయనే మన యజమాని. మానవాళి జీవన మార్గదర్శకత్వం కోసం గ్రంథాలను, ప్రవక్తలను పంపించాడు. మన మనోకాంక్షలకు బానిసై జీవితాన్ని గడిపితే ఆ సృష్టికర్తకు ప్రియదాసులము కాలేము. మనం చేసే కర్మలు అవి మంచివో, చెడ్డవో మనం నిర్ణయించలేము. మనం చేసే పనిలో దేవుని ఇష్టాఇష్టాలు చూడాలి. కరుణామయుడు తన ఇష్టాయిష్టాలేమిటో ప్రజలకు తెలియజేసేందుకు ప్రవక్తలను పంపాడు. వారు దైవ గ్రంథాల ద్వారా విడమర్చిచెప్పారు. ఆ కోవకు చెందినదే ఖుర్ఆన్ గ్రంథం. ఈ గ్రంథం ముహమ్మద్ ప్రవక్త మనో ఫలకంపై అవతరించింది.

ఆ కరుణామయుడు ఖుర్ఆన్ గ్రంథంలో మానవాళికి ఎలాంటి మార్గదర్శకాలు చేస్తున్నాడో అందులోని కొన్ని వాక్యాలు మీ ముందుంచుతాను. ఆయన మనల్నుండి ఏమి ఆశిస్తున్నాడో తెలుసుకోవచ్చు. మనం ఎలాంటి జీవితాన్ని గడిపితే స్వర్గానికి

అర్హత సాధించవచ్చు. దేవుడు అనంత కరుణామయుడు కాబట్టే స్వర్గానికి అర్హత సాధించేందుకు కఠిన పరీక్షలు పెట్టలేదు. కష్టాలకు గురిచేసే విషమ పరీక్షలు నిర్దేశించలేదు. ఆ దైవం మనల్ని ఎంతగానో ప్రేమిస్తాడు. మనిషి నైజానికి తగ్గ బాధ్యతలే అప్పజెప్పాడు. ఆ కరుణ గల దేవుడిని ఒకే ఒక్కడిగా భావించి, ఆయనకు భాగస్వాములెవ్వరూ లేరని విశ్వసించి, ఆయన చెప్పినట్లుగా నడుచుకుంటే మనం ముమ్మాటికీ విజయం సాధించినట్లే. స్వర్గానికి అర్హత సాధించినట్లే. కోటానుకోట్ల ఆయుష్షుగల శాశ్వత జీవితానికి అర్హులమైనట్లే. ఇదే నిజమైన విజయం.

ఆ దేవుడు మనల్ని ఏమి ఆశిస్తున్నాడో ఆ ఖుర్ఆన్ గ్రంథ ఆదేశాల ద్వారా తెలుసుకుందాం.

విశ్వసించి, మంచి పనులు చేసేవారే స్వర్గవాసులు. వారు స్వర్గంలోనే శాశ్వతంగా ఉంటారు. *(దివ్యఖుర్ఆన్ 2:82)*

ఆ స్వర్గం భూమ్యాకాశాల అంత విశాలమయింది. అది భయభక్తులు కలవారి కొరకు తయారు చెయ్యబడింది. వారు కలిమిలో, లేమిలో, ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చుచేసే వారు, కోపాన్ని దిగమ్రింగేవారు, ఇతరుల తప్పులను క్షమించే వారు – ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం– వారి స్థితి ఎలా ఉంటుం దంటే, ఎప్పుడైనా ఏదైనా అశ్లీలకార్యం వారి వల్ల జరిగిపోతే లేదా ఏదైనా పాపం చేసి, వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లయితే, వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అప్పుడు వారు ఆయనను తమ తప్పులు క్షమించు అని వేడుకుంటారు– ఎందుకంటే అల్లాహ్ తప్ప పాపాలను క్షమించగలిగే వాడెవడున్నాడని– వారు తాము చేసిన తప్పులను గురించి బుద్ధిపూర్వకంగా మొండివాదం చెయ్యరు. అలాంటి వారికి తమ ప్రభువు వద్ద లభించే ప్రతిఫలం ఏమిటంటే, ఆయన వారిని క్షమిస్తాడు. క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యానవనాలలోకి వారిని ప్రవేశింపజేస్తాడు. వారు అక్కడ శాశ్వతంగా ఉంటారు. మంచిపనులు చేసేవారికి ఎంత చక్కని ప్రతిఫలం!

*(దివ్య ఖుర్ఆన్ 3:133–136)*

విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరికొకరు సహచరులు, వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు. నమాజును స్థాపిస్తారు. జకాత్‌ను ఇస్తారు. అల్లాహ్ పట్ల ఆయన ప్రవక్త

పట్ల విధేయత పాటిస్తారు. వారిమీదనే అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పకుండా అవతరింపజేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అందరి కంటే ప్రబలుడు. వివేకవంతుడూ, వివేచనాపరుడూను. (దివ్య ఖుర్ఆన్ 9:71)

అల్లాహ్ వైపునకు మాటిమాటికీ మరలేవారూ, ఆయనను ఆరాధించేవారూ, ఆయనను స్తుతించేవారూ, ఆయన కొరకు భూమి మీద సంచారం చేసేవారూ, ఆయన సన్నిధిలో రుకూలూ, సజ్దాలూ చేసేవారూ, మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపించే వారూ, చెడు చెయ్యవద్దు అని నిరోధించేవారూ, అల్లాహ్ విధించిన హద్దులను కాపాడేవారూ (ఇటువంటి గుణవిశేషాలు కల విశ్వాసులు అల్లాహ్‌తో ఇటువంటి వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంటారు). ప్రవక్తా! ఇటువంటి విశ్వాసులకు శుభవార్త అందజెయ్యి. *(దివ్య ఖుర్ఆన్ 9:112)*

నీ ప్రభువు నీపై అవతరింపజేసిన ఈ గ్రంథం సత్యమని గ్రహించిన వ్యక్తీ, ఈ యథార్థం పట్ల అంధుడైన వ్యక్తీ– వారు ఉభయులూ ఎలా సమానులు కాగలరు? హితబోధను వివేకవంతులు మాత్రమే స్వీకరిస్తారు. వారి ప్రవర్తన ఎలా ఉంటుందంటే, వారు అల్లాహ్‌తో చేసుకున్న తమ ఒడంబడికను నెరవేరుస్తారు. దానిని దృఢపరచిన తరువాత భంగపరచరు. వారి వైఖరి ఎలా ఉంటుందంటే, స్థిరపరచండి అని అల్లాహ్ ఆదేశించిన సంబంధాలను స్థిరపరుస్తారు. తమ ప్రభువునకు భయపడుతూ ఉంటారు. తమ నుండి కఠినంగా లెక్క తీసుకోబడుతుందేమో అని భయపడుతూ ఉంటారు. వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే, తమ ప్రభువు ప్రసన్నత కోసం సహనంతో వ్యవహరిస్తారు. నమాజును స్థాపిస్తారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి బహిరంగంగా, రహస్యంగా ఖర్చు చేస్తారు. చెడును మంచి ద్వారా పారద్రోలుతారు. పరలోక గృహం వారి కొరకే ఉన్నది. *(దివ్య ఖుర్ఆన్ 9:19–22)*

వారు ఎలాంటి వారంటే, (ప్రపంచంలో) మొక్కుబడి చెల్లించేవారు, నలువైపుల నుండి ఆపదలు కమ్ముకొనివచ్చే దినానికి భయపడేవారు మరియు అల్లాహ్ మీది ప్రేమతో పేదలకూ, అనాథులకూ, ఖైదీలకూ అన్నం పెట్టేవారు. (వారు వారితో ఇలా అంటారు), "మేము కేవలం అల్లాహ్ కోసమే మీకు అన్నం పెడుతున్నాము. మేము మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్నిగానీ, కృతజ్ఞతలను గానీ ఆశించటం లేదు. దుర్భరమైన ఆపదలతో కూడుకున్న సుదీర్ఘమైన రోజున మా ప్రభువు విధించే శిక్ష గురించి మేము భయపడుతున్నాము." కనుక అల్లాహ్ వారిని ఆనాటి కీడు నుండి

రక్షిస్తాడు, వారికి తాజాదనాన్నీ, ఆనందాన్నీ ప్రసాదిస్తాడు. వారి సహనానికి ప్రతిఫలంగా వారికి స్వర్గాన్నీ, పట్టువస్త్రాలనూ ప్రసాదిస్తాడు.

*(దివ్య ఖుర్ఆన్ 76:7-12)*

సోదరి, సోదరుడా!

స్వర్గాన్ని పొందేందుకు అల్లాహ్ ఎలాంటి సులభమైన పరీక్షలు పెట్టాడో ఖుర్ఆన్ బోధనలు చదివారుగా. ఈ పరీక్షలు మనిషి భరించలేని క్లిష్టమైన పరీక్షలేం కాదుగదా. మన చేతులు, కాళ్లు నరుక్కోమనో, రక్తాన్ని చిందించమనో, నిప్పురవ్వల మీద నడవమనో, పర్వతాలను పగలగొట్టి సముద్రాల్లో విసిరివేయమనో చెప్పలేదుకదా! దేవుడు చెప్పిన హితబోధలు ఆచరించడం ఎంతో సులభతరం. వీటిని పాటించడం వల్ల జీవితం సాఫీగా సాగుతుంది. అల్లాహ్‌ను గుర్తించకుండా, ఆయన్ని వదిలి మన స్వహస్తాలతో చేసిన విగ్రహాలను పూజించి, మన మనోకాంక్షలకు బానిసలమైతే మనకు మించిన దుర్మార్గుడు, మూర్ఖుడు మరొకరుండరు.

మీరు చెడ్డవారని నేను అనడం లేదు. నేను చెప్పేదల్లా ఒక్కటే నిజమైన దేవుడిని గుర్తించాలి. కేవలం ఆయన ముందు మాత్రమే శిరస్సు వంచాలి. ఆయన ముందే చేయిచాచి అడగాలి. మీరు మంచి పనులే చేస్తున్నారు కానీ ఆ దేవుని ఇష్టం ఏమిటో తెలుసుకోండి. ఆయన ఇష్టాలకు అనుగుణంగా మీ కర్మలను మలచుకోండి. చేసే ప్రతీ పనీ ఆయన మెప్పుకోసమే ఉండాలి. అప్పుడు ఆ దైవం మిమ్మల్ని ఎంతగా ఇష్టపడతాడో చూస్తారు. ఆయన తన సకల సౌభాగ్యాలను కుండపోతగా కురిపిస్తాడు.

నేను చెప్పే మాటలన్నీ పాజిటివ్‌గా తీసుకుంటారని ఆశిస్తున్నాను. నేను చెప్పే మాటలపై చింతన చేస్తారని అనుకుంటున్నాను. ఆ దైవం మనందరికీ తోడ్పడుగాక. (ఆమీన్)

# 9. భగభగ మండే అగ్నిగుండంలో ఎవరు విసిరివేయబడతారు?

నా ప్రియసోదరి, సోదరుడా!

మనందరి పాలకుడు, పోషకుడూ అయిన సృష్టికర్త మన పట్ల అసంతృప్తి చెంది, మనల్ని భగభగమండే అగ్నిలో పడేయడాన్ని ఎవరూ ఇష్టపడరు. జీవితాంతం మనల్ని పుట్టించిన ఆ దైవాన్ని సంతుష్టపరచడానికే కృషిచేయాలి. ఆ దైవం తన కారుణ్య చూపులను మనవైపునుండి తిప్పుకోనివ్వకుండా జాగ్రత్తపడాలి. ఒకరి అభిరుచులను తెలుసుకోవాలంటే ముందుగా వారికి ఏ విషయాలంటే ఇష్టముండవో తెలుసుకోవాలి. ఎలాంటి వైఖరి అంటే ఇష్టముండదో అవగాహన పర్చుకోవాలి. ఒకరి ఇష్టాయిష్టాలను గురించి తెలుసుకోనంతవరకూ ఎవరినీ సంతోషపర్చలేము. ఇదే విషయం దేవుని విషయంలోనూ సరిపోతుంది. మనల్ని మనిషిగా పుట్టించి, బుద్ధిజ్ఞానాలు ఇచ్చింది పశువుల్లా బ్రతకడానికి కాదు. మన తాత ముత్తాతలను గుడ్డిగా నమ్మి వారిని అనుసరించేందుకు అసలే కాదు.

మనం సత్యాన్ని అన్వేషించాలి. సత్యం ఎప్పటికైనా సత్యమే. మన జీవిత లక్ష్యాన్ని తెలిపే సత్యాన్ని అన్వేషించాలి. సత్యాన్ని అన్వేషించడంలో విఫలమైతే జీవితంలో వైఫల్యం చెందినట్లే. మన రాబోవు జాతుల సాఫల్య, వైఫల్యాల రహస్యమిదే.

ఇక్కడ కొన్ని విషయాలు వివరించే ప్రయత్నం చేస్తాను. అయితే అవి నా సొంత మాటలు కావు, దైవ గ్రంథంలోనివి. ఎలాంటి ఆచరణల వల్ల దేవుడు అయిష్టానికి, ఆగ్రహానికి గురవుతాడో వివరించే ప్రయత్నం చేస్తాను. నరకాగ్నిలో విసిరేయబడటానికి కారణమైన ఆ కర్మలు ఏమిటో వివరిస్తాను.

యథార్థం ఏమిటంటే మమ్మల్ని కలుసుకోవాలని ఆశించనివారూ ప్రాపంచిక జీవితమునే వరించి దానితోనే తృప్తి చెందినవారూ మా సూచనల పట్ల నిర్లక్ష్య భావం కలిగివున్న వారూ – అటువంటి వారి అంతిమ నివాస స్థలం నరకమే అవుతుంది. వారు (తమ ఈ తప్పుడు విశ్వాసం, తప్పుడు ప్రవర్తనలు కారణంగా) చేస్తూ వచ్చిన చెడులకు ఫలితంగా. *(దివ్య ఖుర్ఆన్ 10:7–8)*

కేవలం ఈ ప్రాపంచిక జీవితాన్నీ, దాని ఆకర్షకాలనూ కోరుకునే వారు చేసిన పనులకు పూర్తి ప్రతిఫలాన్ని మేము వారికి ఇక్కడనే ఇచ్చేస్తాము. ఇందులో వారికి తక్కువ చెయ్యటం అంటూ జరుగదు. అయితే పరలోకంలో అటువంటి వారికి అగ్ని తప్ప మరేమీ ఉండదు. (అక్కడ తెలిసిపోతుంది) వారు ప్రపంచంలో చేసినదంతా మట్టిలో కలసిపోయింది అనీ, వారు చేసినదంతా కేవలం మిథ్యఅనీ.

*(దివ్య ఖుర్ఆన్ 11:15–16)*

చూడు! అల్లాహ్‌తో పాటు మరొకరిని ఆరాధ్యుడుగా చేసుకోకు. అలా చేస్తే నిందల పాలవుతావు. ప్రతి మేలుకూ దూరమవుతావు. నరకంలో పడవెయ్యబడతావు.

*(దివ్య ఖుర్ఆన్ 17:39)*

ఇది ప్రతిఫలం వారి దుశ్చేష్టకు. వారు మా ఆయతులను తిరస్కరించి ఇలా అన్నారు: "మేము కేవలం ఎముకలుగా, దుమ్ముగా, ధూళిగా మారిపోయిన తరువాత సరికొత్తగా మమ్మల్ని పుట్టించి లేపి నిలబెట్టడం జరుగుతుందా?" భూమినీ ఆకాశాలనీ సృష్టించిన దేవుడు అటువంటివారిని పుట్టించే శక్తిని కూడా తప్పకుండా కలిగివుంటాడనే విషయం వారికి తోచనే లేదా? ఆయన వారిని తిరిగిలేపటానికి ఒక సమయాన్ని నిర్ణయించి ఉంచాడు. అది రావటం తథ్యం. కాని దుర్మార్గులు మొండిగా దానిని తిరస్కరించటానికే పూనుకున్నారు. *(దివ్యఖుర్ఆన్ 17:98–99)*

నరకం మార్గం తప్పిన వారి ముందు తెరువబడుతుంది. వారిని ఇలా అడగటం జరుగుతుంది, "అల్లాహ్‌ను వదలిపెట్టి, మీరు ఆరాధించేవారు ఇప్పుడెక్కడున్నారు? వారు మీకేమైనా సహాయం చేస్తున్నారా? లేదా తమను తాము రక్షించుకోగలరా?" తరువాత ఆ దేవుళ్లూ, మార్గం తప్పిన ఈ మానవులూ, ఇబ్లీస్ సైన్యమూ, అందరూ దానిలోకి ఒకరి మీద ఒకరు పడేటట్లుగా త్రోయబడతారు.

*(దివ్య ఖుర్ఆన్ 26:91–95)*

ఇక ఎవరు తిరస్కరించారో, మా ఆయతులను తృణీకరించారో, వారు నరకవాసులవుతారు. అందులోనే వారు శాశ్వతంగా ఉంటారు అది బహుచెడ్డ నివాసం. *(దివ్యఖుర్‌ఆన్ 64:10)*

వారు అపరాధులను, “మిమ్మల్ని ఏ విషయం నరకంలోకి తీసుకువెళ్ళింది?” అని అడుగుతారు. దానికి వారు ఇలా అంటారు, “మేము నమాజు చేసేవారిలోని వారం కాము, నిరుపేదలకు అన్నం పెట్టేవాళ్ళం కాము, సత్యానికి వ్యతిరేకంగా మాటలు కల్పించే వారితో కలిసి మేము కూడ మాటలను కల్పించేవారము; మరియు తీర్పుదినం అబద్ధమని చెప్పేవారము; చివరకు ఆ అనివార్య విషయం మాకు ఎదురయింది.” అప్పుడు సిఫారసు చేసే వారి సిఫారసు, వారికి ఏ మాత్రం ఉపయోగపడదు. *(దివ్యఖుర్‌ఆన్ 74:40-48)*

మేము మానవుణ్ణి పరీక్షించటానికి అతనిని ఒక మిశ్రమ వీర్య బిందువుతో సృష్టించాము. ఈ లక్ష్యం కోసం మేము అతనిని వినేవాడుగా, చూసేవాడుగా చేశాము. మేము అతనికి మార్గం చూపాము; ఇక అతను కృతజ్ఞతలు తెలిపేవాడైనా కావచ్చు లేదా సత్యాన్ని తిరస్కరించే వాడైనా కావచ్చు. సత్యతిరస్కారుల కొరకు మేము సంకెళ్లను, కంఠపాశాలను, మండే అగ్నిని సిద్ధపరచి ఉంచాము.

*(దివ్య ఖుర్‌ఆన్ 76:2-4)*

చూసే ప్రతిదాని ముందు నరకాన్ని తెచ్చి పెట్టినప్పుడు, హద్దులు మీరి ప్రవర్తించి ఐహిక జీవితానికి ప్రాధాన్యమిచ్చిన వాడికి నరకమే నివాసమవుతుంది.

*(దివ్య ఖుర్‌ఆన్ 79:36-39)*

తీర్పుదినాన్ని తిరస్కరించే తిరస్కారులకు ఆ రోజున వినాశం ఉన్నది. హద్దు మీరి ప్రవర్తించే దుర్మార్గుడు తప్ప ఏ ఒక్కడూ దానిని తిరస్కరించలేడు. అతడికి మా వాక్యాలు వినిపించి నప్పుడు, “ఇవి పూర్వకాలపు కట్టుకథలే” అని అంటాడు. ఎంత మాత్రం కాదు, అసలు వారి హృదయాలకు వారి దుష్కార్యాల తుప్పు పట్టింది. ఎంత మాత్రం కాదు, నిశ్చయంగా ఆ రోజున వారు తమ ప్రభువు దర్శనం లభించ కుండా చేయబడతారు. తరువాత వారు నరకంలోకి పోయిపడతారు. అప్పుడు వారితో “మీరు తిరస్కరిస్తూ ఉండినది ఇదే” అని చెప్పటం జరుగుతుంది.

*(దివ్య ఖుర్‌ఆన్ 83:10-17)*

ఎవరైతే విశ్వాసులైన పురుషులను, స్త్రీలను హింసించారో, ఆ తరువాత దానికి పశ్చాత్తాపపడరో, నిశ్చయంగా వారు నరక యాతనకు గురి అవుతారు. ఆపై వారికి కాల్చివేసే శిక్ష పడుతుంది. *(దివ్యఖుర్‌ఆన్ 85:10)*

వీలైనంత ఎక్కువగా ఒకరిని మించి ఒకరు ప్రపంచాన్ని పొందాలనే ధ్యాస మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరకు మీరు (ఈ వ్యామోహంలోనే) శ్మశానానికి చేరుకుంటారు. (మీరను కునేది) ఎంత మాత్రం కాదు, త్వరలోనే మీకు తెలిసిపోతుంది. మరొకసారి (వినండి, మీరనుకునేది) ఎంతమాత్రం నిజం కాదు, అతి త్వరలోనే మీకు తెలిసిపోతుంది. ఎంతమాత్రం కాదు, మీరు గనక నిశ్చయజ్ఞానంతో (మీ ఈ వైఖరి పర్యవసానాన్ని) తెలుసుకుంటే, (మీ నడవడిక ఇలా ఉండదు). మీరు నరకాన్ని చూసితీరుతారు. మరొకసారి (వినండి) మీరు పూర్తి నమ్మకంతో దాన్ని చూస్తారు. *(దివ్య ఖుర్‌ఆన్ 102-1-7)*

నా ప్రియ సోదరి, సోదరుడా! ప్రశాంత మనసుతో ఈ విషయాల గురించి ఆలోచించండి. మరణానంతరం రాబోవు జీవితంలో నరక జ్వాలల నుండి బయటపడాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. ఆ నరకాగ్ని నుండి మనల్ని మనం రక్షించుకునే స్థలం ఈ ప్రాపంచిక జీవితమే. ఈ జీవిత ఘడియలు అత్యంత వేగంగా ముందుకు సాగుతున్నాయి. మరణానంతర జీవితం అసంభవమని మనం చేసిన వాదన పెద్ద తప్పిదమని ఆ రోజు తెలుసుకుంటాము. ఆ జీవితాన్ని విస్మరించాము. దేవుడిచ్చినది అనుభవించాము కానీ ఆయన్నే విస్మరించాము. జీవితాన్ని హాయిగా గడిపాము కానీ ఇతరులను దేవుళ్లుగా కొలిచాము. ఇష్టారీతిన జీవితాన్ని గడిపాము. ప్రపంచమే సర్వస్వమనుకుని సుఖభోగాల్లో మునిగిపోయాము. ప్రపంచాన్ని సాధించాలనే అత్యాశతో జీవితాన్ని గడిపాము. ఏదో ఒకరోజు ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోవాల్సిందే. నరక కూపం నుంచి మనల్ని మనం తప్పించుకుని, మన భార్యాబిడ్డల్ని కాపాడాలంటే ఇప్పటికీ అవకాశం ఉంది. ఈ అవకాశం, సమయం పోతే మళ్లీ దొరకదు. మన భార్యా పిల్లలు, మన తల్లిదండ్రులు, స్వతహాగా మనవైపు దేవుడు ఆ చల్లని చూపులు చూడాలని, నరకాన్నుంచి తప్పించుకోవాలని ఎవరికుండదు. చివరికి చిటికెన వేలు కూడా నరకాగ్నిలో కాలడానికి ఇష్టపడము. వాస్తవాలు కళ్ల ముందుకొచ్చినప్పుడు, నరకాగ్ని ముందుకొచ్చినప్పుడు కళ్లు తెరుచుకుంటాయి. మనం చేసిన పాపాలేమిటో తెలుస్తాయి. అప్పుడు పశ్చాత్తాపపడితే ఒరిగేదేమీ ఉండదు.

ఇప్పుడు కావాల్సినంత తీరిక మన దగ్గర ఉంది. స్వర్గ, నరకాలు లేవని ప్రతిఘటించే ఆధారాలు మనవద్ద ఏమీ లేవు. దేవుడు మనకు జీవితాన్నిచ్చాడు. మనం స్వతహాగా ఈ లోకంలోకి రాలేదు. ఆయనే ఈ జీవితాన్ని ప్రసాదించాడు. ఈ జీవితంలో పరీక్షిస్తాననీ చెప్పాడు. ఇక్కడ చేసుకున్న కర్మలన్నింటి లెక్క తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించాడు. మరలాంటప్పుడు తిరస్కరించే హక్కు మనకెక్కడిది. దేవుడు ప్రవక్తలను పంపి అన్ని విషయాలు విడమర్చిచెప్పాడు. దైవ గ్రంథం సజీవంగా ఉంది. దీన్ని విస్మరిస్తే నష్టాన్ని చవిచూసేది మనమే. ఈ రోజు మనం ఆరోగ్యంగా ఉన్నాము. మృత్యువు సంభవించినప్పుడు మన కాళ్లూ, చేతులూ ఇతర అవయవాలేవీ మన కంట్రోల్‌లో ఉండవు. ప్రాణం గొంతులోకి వస్తుంది. అప్పుడు పశ్చాత్తాపం చెంది దేవుడిని విశ్వసిస్తానంటే ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. ఏకాంతంలో ఒక్కసారి ఆలోచించండి. సరైన నిర్ణయానికి వస్తారు. దేవుడు నన్నూ, మిమ్మల్ని కాపాడుగాక! (ఆమీన్)

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

# 10. అమితంగా ప్రేమించే సృష్టికర్త పిలుపు

తల్లి తన పిల్లల్ని ఎంతగానో ప్రేమిస్తుంది. ఏ కష్టమూ రాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. చిన్న చీమ కుట్టినా తల్లడిల్లిపోతుంది. తల్లి ప్రేమకంటే ఎన్నో రెట్లుమించి ప్రేమించే ప్రభువు తన దాసులను అగ్ని జ్వాలల్లో ఆహుతి కావాలని ఎలా కోరుకుంటాడు. నరకాగ్ని నుండి తప్పించుకుని స్వర్గవనాలకు అర్హత సాధించాలని అప్రమత్తం చేస్తున్నాడు. ఏ విధంగానైతే తల్లి తన కొడుకును 'బిడ్డా కష్టపడి చదువు, లేదంటే పరీక్షల్లో ఫెయిలవుతావు' అని ఎలా నచ్చచెబుతుందో అలానే అల్లాహ్ కూడా మనకు రకరకాలుగా నచ్చచెబుతున్నాడు. నయానో భయానో జనాలను అప్రమత్తం చేస్తున్నాడు. ఒక్కోసారి బుజ్జగించి, మరోసారి భయపెట్టి, ఇంకోసారి ఆశపెట్టి పరలోక విజయం వైపు పిలుస్తున్నాడు.

'ఎన్ని పాపాలు చేసినప్పటికీ దేవుడు మమ్మల్ని స్వర్గంలో ఎందుకు ప్రవేశింపజేయడు' అనే సందేహం కలుగకమానదు. దీనికి జవాబు ఒక్కటే.. దేవుడు మనకు మంచి చెడు విచక్షణ ఇచ్చాడు, బుద్ధీ జ్ఞానాలు ప్రసాదించాడు. అయినప్పటికీ బుద్ధిని ఉపయోగించకుండా, తప్పుడు మార్గాన్ని ఎంచుకుని, ఇతరులపై దౌర్జన్యాలకు తెగబడి, బాధితుల శాపానికి గురవుతానంటే ఎలా? పరలోకంలో తీర్పుదినాన దుర్మార్గులకు, బాధితులకు ఒకేచోట స్థానం కల్పించి దేవుడు అన్యాయం చేయడు. బాధితులకు స్వర్గం, దుర్మార్గులకు నరకం లభించడమే నిజమైన న్యాయం.

మనిషికి బుద్ధీజ్ఞానాలు ఇవ్వడమే కాదు, వారి జీవన మార్గదర్శకం కోసం ప్రవక్తలను పంపాడు. వారు సన్మార్గం వైపు వారిని పిలిచారు. దైవ గ్రంథాలను అవతరింపజేశాడు. ఈ పరంపరలో చిట్టచివరి ప్రామాణిక గ్రంథం దివ్య ఖుర్ఆన్. ఈ గ్రంథంలో తల్లిలా బోధించాడు. మంచి పనులు చేసేవారికి బోలెడన్ని శుభవార్తలు

న్నాయి ఇందులో. తప్పుడు మార్గాల్లో పయనించే వారికి శిక్షల భయం గురించి హెచ్చరించాడు. తనవైపునకు మరలేలా ఎన్నో నిదర్శనాలను, మరెన్నో ఉపమానాలతో నచ్చచెప్పాడు. ఈ గ్రంథంలో నుంచి కొన్ని పాఠాలను పేర్కొంటున్నాను. అవి ఎంత మనోహరంగా చెప్పబడ్డాయో మీరే చదవండి. ఎంత ప్రేమగా, ఎంత లాలిత్యంగా చెప్పబడ్డాయో మీరే చూడండి. ఇందులో చెప్పబడ్డ అంశాలు సమస్త మానవాళిని ఉద్దేశించి చెప్పబడ్డాయి. ఇందులోని ఉపదేశాలు ఏదో ప్రత్యేక జాతి కొరకో, ఒక వర్గం వారి కోసమో కాదు. ఈ హితవులన్నీ దైవ దాసులందరికోసం చెప్పబడ్డాయి. 'ఓ మనిషీ! నువ్వు నా దాసుడివి' అని ప్రేమగా పిలుస్తున్నాడు.

ఆకాశం బ్రద్దలైనప్పుడు, నక్షత్రాలు చెదిరిపోయినప్పుడు, సముద్రాలు చీల్చబడినప్పుడు, సమాధులు తెరువబడినప్పుడు– అప్పుడు ప్రతి మనిషికీ తాను ముందూ వెనుకా చేసుకున్నదంతా ఏమిటో తెలిసిపోతుంది. ఓ మానవుడా! పరమదాత అయిన నీ ప్రభువును గురించి ఏ విషయం నిన్ను మోసంలో పడవేసింది? ఆయనే నిన్ను సృష్టించాడు, ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు, నిన్ను తగిన రీతిలో పొందికగా రూపొందించాడు, తాను తలచిన ఆకారంలో నిన్ను క్రమబద్ధంగా మలిచాడు. (ఖుర్ఆన్ 82:1–8)

ఓ మానవుడా! నీవు భారంగా, బలవంతంగా నీ ప్రభువు వైపునకు వెళుతున్నావు, ఆయనను కలుసుకోబోతున్నావు. (ఖుర్ఆన్ 84:6)

మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది. మీ కొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటు చేసి మీకు ఉపాధి కల్పించినవాడూ ఆయనే! ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి. (ఖుర్ఆన్ 2: 21,22)

మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి.

బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి. (దివ్య ఖుర్ఆన్ 4:1)

మానవులారా! ఈ ప్రవక్త మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి సత్యం తీసుకువచ్చాడు. అతన్ని విశ్వసించండి, మీకే మంచిది. కాని మీరు గనక తిరస్కరిస్తే, ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే అనే విషయం తెలుసుకోండి. అల్లాహ్ అన్నీ తెలిసినవాడూ, అత్యంత వివేకీనూ. (దివ్య ఖుర్ఆన్ 4:170)

మానవులారా! మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు స్పష్టమైన నిదర్శనం వచ్చింది. మేము మీ వద్దకు మీకు స్పష్టంగా మార్గం చూపే జ్యోతిని పంపాము. ఇక అల్లాహ్ మాటను ఆలకించే వారిని, ఆయన శరణు వేడుకునే వారిని అల్లాహ్ తన కరుణతో తన అనుగ్రహంతో కప్పివేస్తాడు. వారికి తన వైపునకు వచ్చే రుజుమార్గం చూపుతాడు. (దివ్యఖుర్ఆన్ 4:174, 175)

ముహమ్మద్! ఇలా ప్రకటించు: "మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను– అతను అల్లాహ్‌ను, ఆయన సూక్తులను విశ్వసిస్తాడు– అతనిని అనుసరించండి, మీరు సరియైన మార్గం పొందుతారేమో. (దివ్య ఖుర్ఆన్ 7:158)

ప్రజలారా! మీరు చేసే ఈ తిరుగుబాటు మీకే హాని కలిగిస్తుంది. ఇహలోక జీవిత సుఖాలు కొన్ని రోజుల సుఖాలు మాత్రమే (వాటిని అనుభవించండి). తరువాత మా వైపునకే మీరు మరలి రావలసి ఉన్నది. అప్పుడు మేము మీకు తెలుపుతాము, మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో. (దివ్యఖుర్ఆన్ 10:23)

మానవులారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫునుండి హితోపదేశం వచ్చేసింది. అది హృదయాల వ్యాధులకు స్వస్థత. దానిని స్వీకరించే వారికి అది మార్గదర్శకత్వం, కారుణ్యం. (ఖుర్ఆన్ 10:57)

ముహమ్మద్! ఇలా చెప్పు: మానవులారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి సత్యం వచ్చేసింది. ఇప్పుడు ఎవడైనా రుజుమార్గాన్ని అవలంబిస్తే అతడి రుజుమార్గ అనుసరణం అతనికే లాభదాయకం. ఎవడైనా మార్గం తప్పితే అతడి ఆ మార్గం తప్పటం అతనికే వినాశకరం. నేను మీకు కావలివాణ్ణి మాత్రం కాను.

(దివ్యఖుర్ఆన్ 10:108)

మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి. యధార్థం ఏమిటంటే, ప్రళయం నాటి భూకంపం మహా (భయంకరమైన) విషయం. దానిని మీరు చూచినప్పుడు దాని స్థితి ఎలా ఉంటుందంటే పాలు పట్టే ప్రతి స్త్రీ పాలు త్రాగే తన పాపను మరచిపోతుంది, ప్రతి గర్భిణి యొక్క గర్భం పడిపోతుంది, ప్రజలు మీకు మత్తులో ఉన్నట్లు కనిపిస్తారు, వాస్తవానికి వారు త్రాగి ఉండరు. కాని అల్లాహ్ శిక్షయే అంత తీవ్రంగా ఉంటుంది. ప్రజలలో కొందరు జ్ఞానం లేకపోయినా అల్లాహ్‌ను గురించి వాదిస్తారు. తిరగబడిన ప్రతి షైతాన్‌ను అనుసరిస్తారు. వాస్తవానికి అతడి అదృష్టం ఇలా వ్రాయబడి ఉంది : వాడిని స్నేహితుడుగా చేసుకునే మనిషిని వాడు మార్గం తప్పించి మరీ వదలిపెడతాడు, నరకయాతన వైపునకు మార్గం చూపుతాడు. (ఖుర్‌ఆన్ 22:1-4)

మానవులారా! ఒకవేళ మీకు మరణానంతర జీవితం గురించి ఏదైనా సందేహం ఉంటే, మీరు ఈ విషయాన్ని తెలుసుకోవాలి: మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము, తరువాత వీర్య బిందువుతో, ఆ తరువాత నెత్తుటి గడ్డతో, ఆపై మాంసపు కండతో అది రూపం కలదిగానూ, రూపం లేనిది గానూ ఉంటుంది. (మేము ఈ విషయాన్ని) మీకు యధార్థం ఏమిటో స్పష్టం చెయ్యాలని (తెలుపుతున్నాము). మేము కోరిన (వీర్య బిందువును) దానిని ఒక ప్రత్యేక కాలం వరకు మాతృ గర్భాలలో నిలిపి ఉంచుతాము. తరువాత మిమ్మల్ని ఒక శిశువు రూపంలో బయటికి తీస్తాము. (ఆ తరువాత మీకు పెట్టి పోషిస్తాము) మీరు నిండు యౌవన దశకు చేరటానికి. మీలో ఒకడు ముందుగానే వెనుకకు పిలుచుకోబడతాడు, మరొకడు అతి నికృష్టమైన వయస్సు వైపునకు మరలింపబడతాడు, అంతా తెలిసిన తరువాత కూడ ఏమీ తెలియకుండా ఉండటానికి. ఎండిపోయిన నేలను మీరు చూస్తున్నారు, తరువాత మేము దానిపై వర్షం కురిపించగానే, అకస్మాత్తుగా అది పులకరిస్తుంది మరియు ఉబుకుతుంది, ఇంకా అది అన్ని రకాల మనోహరమైన మొక్కలను మొలకెత్తించటం ప్రారంభిస్తుంది. దీనికంతటికీ కారణం, అల్లాహ్‌యే సత్యం కావటం, ఆయన మృతులను బ్రతికించటం, ప్రతిదానిపై అధికారం కలిగి ఉండటం; ఇంకా (ఇది మరొక విషయానిక్కూడ నిదర్శనమే) ఏమిటంటే, ప్రళయఘడియ తప్పకుండా వచ్చి తీరుతుంది, ఇందులో ఏ అనుమానానికీ ఆస్కారం లేదు, గోరీలలోకి వెళ్ళిపోయినవారిని అల్లాహ్ తప్పకుండా లేపుతాడు. (దివ్య ఖుర్‌ఆన్ 22:5-7)

ఓ ప్రవక్తా! ఇలా అను, "మానవులారా! నేను మీకు కేవలం (కష్టకాలం రాకముందు) స్పష్టంగా హెచ్చరించే వ్యక్తిని మాత్రమే." కనుక విశ్వసించి మంచి పనులు చేసేవారికి క్షమాభిక్ష లభిస్తుంది, గౌరవప్రదమైన ఉపాధి కూడ లభిస్తుంది. మా ఆయతులను కించపరచటానికి ప్రయత్నం చేసే వారు నరకానికి మిత్రులు.

(దివ్య ఖుర్ఆన్ 22:49-51)

మానవులారా! ఒక ఉదాహరణ ఇవ్వబడుతోంది; దానిని శ్రద్ధగా వినండి: అల్లాహ్‌ను కాదని మీరు ఏ దేవుళ్లను వేడుకుంటున్నారో, వారందరూ కలసి సమైక్యంగా ఒక్క ఈగను సృష్టించదలచినా, అలా చేయలేరు. అంతేకాదు, ఒకవేళ ఈగ వారినుండి ఏదైనా వస్తువును లాక్కుపోయినా, వారు దానిని విడిపించుకురానూలేరు. సహాయాన్ని అర్థించేవారూ బలహీనులే, సహాయం కోసం అర్థింపబడేవారూ బలహీనులే. అల్లాహ్ గొప్పతనాన్నే వారు గుర్తించ వలసిన విధంగా గుర్తించలేదు. నిజానికి అల్లాహ్ మాత్రమే శక్తిమంతుడు, గౌరవనీయుడూను. (ఖుర్ఆన్ 22:73-74)

మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి. ఏ తండ్రీ తన కుమారునికి బదులుగా ముందుకు రాని, ఏ కుమారుడూ తన తండ్రికి బదులుగా నిలబడని ఆ రోజుకు భయపడండి, నిస్సందేహంగా అల్లాహ్ వాగ్దానం సత్యం. కనుక ఈ ఐహిక జీవితం మిమ్మల్ని మోసానికి గురిచేయకూడదు. వంచకులు మిమ్మల్ని అల్లాహ్ విషయంలో వంచనకు గురి చేయకూడదు. (31:33)

మానవులారా! అల్లాహ్ మీకు చేసిన ఉపకారాలను జ్ఞాపకం ఉంచుకోండి. అల్లాహ్ కాక, భూమ్యాకాశాల నుండి మీకు ఉపాధినిచ్చే మరొక సృష్టికర్త కూడా ఎవడైనా ఉన్నాడా - ఆయన తప్ప మరొక ఆరాధ్యుడెవ్వడూ లేడు. అసలు మీరు ఎవని వల్ల మోసపోతున్నారు? (35:3)

మానవులారా! నిశ్చయముగా అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసానికి గురిచేయకూడదు. ఆ మహావంచకుడు కూడా మిమ్మల్ని అల్లాహ్ విషయంలో మోసగించగలగకూడదు. యథార్థానికి షైతాను మీకు శత్రువు. కనుక మీరు కూడా వాడు మీ శత్రువే అని భావించండి. వాడు, తన అనుచరులు నరక వాసులలో చేరిపోవాలని వారిని తన మార్గం వైపునకు పిలుస్తున్నాడు, అవిశ్వాసానికి పాల్పడే వారికి కఠిన శిక్ష పడుతుంది. విశ్వసించి మంచిపనులు చేసేవారికి క్షమాభిక్ష, గొప్ప ప్రతిఫలం లభిస్తాయి. (35:5-7)

మానవులారా! అల్లాహ్ అవసరం కలవారు మీరే. అల్లాహ్ సర్వసంపన్నుడు. స్వయంగానే స్తుతిపాత్రుడు. ఆయన కోరితే, మిమ్మల్ని తొలగించి, మరేదైనా సృష్టిని మీ స్థానంలో తీసుకురాగలడు. అలా చేయటం అల్లాహ్‌కు ఏ మాత్రమూ కష్టం కాదు. బరువు మోసే వాడెవ్వడూ మరెవరి బరువునూ మోయడు, బరువును మోసే ఆత్మ ఏదైనా తన బరువును మోయమని ఇతరులను పిలిచినప్పుడు, దాని బరువు యొక్క రవ్వంత భాగాన్నయినా ఎత్తుకోవటానికి ఎవ్వడూ ముందుకు రాడు, అతడు ఎంత సమీప బంధువైనా సరే. (ప్రవక్తా) చూడకపోయినప్పటికీ తమ ప్రభువునకు భయపడే వారినీ, నమాజును స్థాపించే వారిని మాత్రమే నీవు హెచ్చరించగలవు. ఏ వ్యక్తి అయినా తన మేలు కొరకే పరిశుద్ధతను అవలంబిస్తాడు. అల్లాహ్ వైపునకే అందరూ మరలవలసి ఉన్నది. (35:15-18)

మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను. (49:13)

ప్రియ సోదరి, సోదరుడా!

మనందరి సృజనకారుడి ప్రేమపూర్వకమైన మాటలు చదివారు. ఒక తల్లి తన బిడ్డకు చెప్పినట్లుగా, తండ్రి తన బిడ్డను శత్రువు బారి నుండి కాపాడినట్లుగా ఉన్నాయి కదూ ఈ మాటలు. మనిషికి షైతాన్ ఆగర్భ శత్రువు. వాడు మనిషిని తన వెంట నరకంలోకి తీసుకెళ్లాలన్నదే వాడి వ్యూహం. దైవం మాత్రం మనల్ని సన్మార్గంలోకి తీసుకెళ్లాలనుకుంటున్నాడు. దాని గమ్యం స్వర్గం. స్వర్గానికి బలవంతంగా తీసుకెళ్లడం లేదు. బుద్ధి వివేకాలతో అతన్ని చైతన్య పర్చి స్వతహాగా స్వర్గమార్గంలో పయనించేలా ప్రేరేపిస్తున్నాడు. బుద్ధి జ్ఞానాలను వినియోగించే శక్తినిచ్చి శాశ్వత సంతోషాల స్వర్గానికి అర్హత సాధించేలా చేస్తాడు. ప్రళయం వరకు పుట్టే ప్రతీ ఒక్కరి జీవన మార్గదర్శకం కోసం ఖుర్‌ఆన్ గ్రంథాన్ని సురక్షితంగా ఉంచాడు.

# 11. విజయానికి నాంది

నా ప్రియ సోదరి, సోదరుడా!

చివరి శ్వాస వరకూ దైవ నియమావళికి కట్టుబడి జీవితం గడిపితేనే పరలోక జీవితంలో విజయం, ముక్తి మోక్షాలు సాధ్యమని ఇప్పటి వరకూ వచ్చిన శీర్షికల ద్వారా మీ అందరికీ బోధపడి ఉంటుంది. దేవుడు నిర్ణయించిన ఆ విధానమే సాధారణ భాషలో ధర్మం అని అంటారు. మనిషి ఈ పుడమిపై కాలు మోపినప్పటి నుండి నేటి దాకా మనిషి ఎన్నో మతాలు సృష్టించాడు. కానీ మనిషి ఏ మతాన్ని అనుసరించాలి? ఏ మత బోధనలను ఆచరించాలి? అన్నదే ప్రశ్న. ఈ ధర్మాలన్నింటిలో సృష్టికర్తకు ఇష్టమైన, ఆయన ఆమోదించిన ధర్మం ఏది? దాన్ని అన్వేషించి, తెలుసుకోవడమే మన వ్యక్తిగత బాధ్యత.

నా ప్రియ సోదరి, సోదరుడా! కాస్తంత మనసు పెట్టి యోచించండి. ఇది జీవన్మరణాల ప్రశ్న. కోట్లాది సంవత్సరాల ఆయుష్షుండే జీవిత జయాపజయాల ప్రశ్న. ఉదాహరణకు మనం రోగానికి గురైతే, దానికి సంబంధించిన ఔషధం వేరే మతానికి చెందిన వారి దగ్గర ఉంటే మనం దాన్ని వాడకుండా వదిలేస్తామా?

దేవుడైతే ముందు నుంచీ మనిషి మనుగడకు ఒకే ఒక్క జీవన విధానాన్ని చూపించాడు. తన ప్రవక్తల, దైవగ్రంథాల ద్వారా ఈ జీవన విధానాన్ని పరిచయం చేశాడు. మారుతున్న కాలానుగుణంగా ప్రజలు దైవగ్రంథ బోధనల్లో మార్పులు చేర్పులు చేసి తనకు అనుకూలంగా మార్చుకున్నారు. కొత్త కొత్త మతాలను సృష్టించుకున్నారు. తాను ఏ మతంలో పుట్టానో అదే మతాన్ని అనుసరించాలని భావించి గుడ్డిగా నమ్ముతున్నారు. ఈ సృష్టి ఆరంభం నుంచి ప్రళయం సంభవించే వరకూ ఒకే ఒక్క ధర్మం ఉంటుంది. అదే మనిషి జీవన విధానంగా దైవం నిర్ణయించాడు. దాన్ని గుర్తించి, స్వీకరించి, ఆచరించడమే అనివార్యం. దైవ గ్రంథం ద్వారా ఆ దైవ ధర్మం వాస్తవికతను తెలుసుకుందాం.

ప్రారంభంలో మానవులంతా ఒకే మార్గం అనుసరించారు (కాని తరువాత పరిస్థితులు మారాయి. అభిప్రాయభేదాలు ఉత్పన్నమయ్యాయి). అప్పుడు అల్లాహ్ ప్రవక్తలను పంపాడు. వారు సత్యమార్గంలో నడిచేవారికి శుభవార్తలు తెలిపేవారు. వక్రమార్గం అనుసరిస్తే దుష్ఫలితాలు కలుగుతాయని హెచ్చరిక చేసేవారు. సత్యం గురించి ప్రజలలో పొడచూపిన విభేదాలు పరిష్కరించటానికి వారితోపాటు పరమ సత్యం వున్న గ్రంథాన్ని కూడ పంపాడు- (ఈ అభిప్రాయ భేదాలు తలెత్తటానికి కారణం ప్రారంభంలో ప్రజలకు సత్యం తెలుపబడకపోవటం ఎంత మాత్రం కాదు) ఈ విభేదాలను సృష్టించినవారు సత్యజ్ఞానం ప్రసాదించబడ్డవారే. స్పష్టమైన హితోపదేశాలు పొందిన తరువాత కూడ వారు కేవలం ఒకరికొకరు అన్యాయం చేసుకునే ఉద్దేశ్యంతో అసలు సత్యాన్ని వదలి విభిన్న పద్ధతులను సృష్టించుకున్నారు- అయితే ప్రవక్తలను విశ్వసించిన వారికి అల్లాహ్ తన అనుమతితో ప్రజలు వివాదపడిన సత్యాన్ని పొందేమార్గం చూపాడు. అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గం చూపుతాడు. (దివ్య ఖుర్ఆన్ 2:213)

ఈ లోకం ఉనికిలోకి వచ్చినప్పటినుండి ప్రతీ కాలంలోనూ, అన్ని జాతుల కోసం ఒక్కటే ధర్మాన్ని, సత్యమార్గం వైపు పిలవాలని ప్రవక్తలను పంపాడు దైవం. ఆయన ఆజ్ఞలు, ఆదేశాలకు అనుగుణంగా నడిచేందుకు దైవ గ్రంథాలను అవతరింపజేశాడు. కానీ కాలానుగుణంగా ప్రజలు ఈ దైవాదేశాలను తమకు అనుకూలంగా మార్పులు చేర్పులు చేసుకున్నారు.

ఆయన నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకు కూడా నిర్ణయించాడు. దానినే (ముహమ్మద్ (సఅసమ్) ఇప్పుడు నీ వైపునకు మేము వహీ ద్వారా పంపాము. దానినే మేము ఇబ్రాహీమ్‌కు, మూసాకు, ఈసాకు బోధించాము. ఈ ధర్మాన్ని స్థాపించండి అనీ, దానిని గురించి విభేదాలకు లోను కాకండి అనీ తాకీదు చేస్తూ. ఈ విషయమే ఈ బహుదైవారాధకులకు ఎంతో అసహనం కలిగించింది; దాని వైపునకే (ముహమ్మద్ (సఅసమ్) నీవు వారిని ఆహ్వానిస్తున్నావు. అల్లాహ్ తాను కోరిన వారిని తనవారుగా చేసుకుంటాడు. ఆయన తన వైపునకు మరలే వారికి మాత్రమే తన వైపునకు వచ్చే మార్గాన్ని చూపుతాడు. (దివ్య ఖుర్ఆన్ 42:13)

ఈ విశ్వంలోని అణువణువూ దైవ నియమావళికి కట్టుబడి ఉందని దైవ గ్రంథం సుస్పష్టం చేస్తోంది. విశ్వమంతా దైవ విధేయత పాటిస్తోంది. కానీ మనిషికి

మాత్రం పూర్తి స్వేచ్ఛ ఇవ్వబడింది. దైవాన్ని గుర్తించి, ప్రవక్తలను అనుసరించి, దైవ ధర్మానికి కట్టుబడి జీవిస్తే సృష్టి వ్యవస్థ అందులోని జీవరాశులతో సమన్వయం కుదురుతుంది. విజయం చేకూరుతుంది. దీనికి వ్యతిరేకంగా వేరే మార్గాన్ని ఎంచుకుంటే అది ముమ్మాటికీ దైవ ఆమోదయోగ్యం కాదు. పరలోక జీవితంలో వైఫల్యాన్ని చవిచూడాల్సి ఉంటుంది. ఇదే విషయాన్ని దైవ గ్రంథంలో చాలా స్పష్టంగా వివరణ ఉంది.

ఇక ఈ ప్రజలు అల్లాహ్‌కు విధేయత చూపే విధానాన్ని (అల్లాహ్ ధర్మాన్ని) వదలిపెట్టి, మరొక విధానాన్ని దేన్నయినా కోరుతున్నారా ఏమిటి? వాస్తవంగా భూమ్యాకాశాలలో ఉన్న సకల వస్తువులూ ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా అల్లాహ్ విధేయతకు కట్టుబడి ముస్లిములై ఉన్నాయి. ఆయన వైపునకే అంతా మరలిపోవలసి ఉంది. ప్రవక్తా! ఇలా అను : "మేము అల్లాహ్‌ను విశ్వసిస్తాము. మాపై అవతరింప జెయ్యబడిన హితోపదేశాన్ని విశ్వసిస్తాము. ఇంకా ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాఖు, యాఖూబు, యాఖూబు సంతానములపై అవతరించిన దానిని కూడ విశ్వసిస్తాము. ఇంకా మూసా, ఈసా, ఇతర ప్రవక్తలకు వారి ప్రభువు తరఫు నుండి ఇవ్వబడిన ఉపదేశాలను కూడా విశ్వసిస్తాము. మేము వారి మధ్య విచక్షణ చెయ్యము. మేము అల్లాహ్ విధేయతకు కట్టుబడి (ముస్లిములుగా) ఉన్నాము." ఎవడైనా ఈ విధేయతా విధానాన్ని (ఇస్లామ్) కాక మరొక విధానాన్ని అవలంబించదలిస్తే, ఆ మార్గం ఎంతమాత్రం ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడౌతాడు, నష్టపోతాడు. (దివ్య ఖుర్‌ఆన్ 3:83-85)

దైవ ప్రీతి, పరలోకంలో విజయం, ముక్తి మోక్షాలు సాధించాలంటే ఏ ప్రవక్తను, మరే మహనీయుడిని అనుసరించాలన్నది ప్రతీ ఒక్కరికీ తారసపడే ప్రశ్న. ప్రతీ ప్రవక్త చెప్పింది సత్యమే. ప్రవక్తలందరూ ఒక్కటే బోధించారు. కానీ కాలక్రమేణా ప్రవక్తల ప్రబోధనల్లో మార్పులు చేర్పులు చేసుకున్నారు. తమ సొంత మతాలను సృష్టించుకున్నారు. అందుకే దైవం ముహమ్మద్(స)ను చిట్టచివరి ప్రవక్తగా నియమించాడు. ఆయన ద్వారా ధర్మాన్ని పునరుజ్జీవింపజేశాడు. ఆది మానవుడి కాలంనుంచి ఉన్న ధర్మాన్నే ముహమ్మద్ ప్రవక్త ప్రచారం చేశారు. ఈ ధర్మాన్ని ఎలాంటి మార్పులు చేర్పులు చేయకుండా అన్ని ఏర్పాట్లు చేశాడు. ప్రవక్తపై ఖుర్‌ఆన్ గ్రంథాన్ని అవతరింపజేశాడు. ఇది చారిత్రక వాస్తవం. శతాబ్దాలు గడిచినప్పటికీ ఈ గ్రంథంలో ఒక్క అక్షరం కాదుగదా ఒక్క పొల్లు కూడా మారలేదు.

ముహమ్మద్ ప్రవక్త పరిచయం చేసింది కొత్త ధర్మమేమీ కాదు. ఈ పుడమిపై ఆదిమానవుడు కాలుమోపినప్పటి ధర్మమే ఇది. ప్రళయం వరకూ ఈ ధర్మమే స్థిరంగా ఉంటుంది.

నా ప్రియ సోదరి, సోదరుడా! ఈ మాటలు మనస్ఫూర్తిగా చెబుతున్నాను.... జీవిత సవాళ్లను అర్థం చేసుకోవడం, వాటిని పరిష్కరించుకోవడం మన ప్రాథమిక అవసరం. అంతకుమించి మన బాధ్యత కూడాను. ఈ విషయంలో దైవ గ్రంథమైన ఖుర్ఆన్, ముహమ్మద్ ప్రవక్త ఆదర్శాలు మీకు చక్కని పరిష్కారం చూపుతాయి. ఈ గ్రంథాన్ని మనసు పెట్టి అధ్యయనం చేయడం మన బాధ్యత. విజయవాక్కు, సత్యం, న్యాయమే మానవాళి అసలైన సంపద!

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

# చివరి మాట

నా ప్రియ సోదరి/సోదరుడా!

మానవాళికి సత్యమార్గమేదో తెలియచెప్పడమే ఈ పుస్తకంలోని లేఖల సారాంశం. నిర్ణయమనేది వారి అభీష్టానికే వదిలేస్తున్నాను. ఏదైనా విషయాన్ని బలవంతంగా ఒప్పించడం ఎవరి వల్లా కాదు. ప్రవక్తలు సైతం మానవాళిని సన్మార్గం వైపునకు తీసుకొచ్చేందుకు బలవంతపెట్టలేదు. ఏ ప్రవక్తా ఈ కార్యనిర్వహణలో పూర్తిస్థాయిలో సఫలీకృతం కాలేదు.

ఇదొక ప్రయత్నం మాత్రమే, ప్రతీ కాలంలోనూ ప్రతీ మనిషికీ సత్యసందేశం అందించడం అత్యంత అవసరం. స్వీకరించడమయినా, వ్యతిరేకించడమయినా వ్యక్తిగత ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంది. దైవం కూడా తన గ్రంథంలో ఇదే విషయాన్ని చెప్పాడు :

ఎవడైనా కృతజ్ఞతలు తెలిపితే, అతని కృతజ్ఞతలు అతనికే లాభకరం, ఎవడైనా కృతఘ్నుతకు పాల్పడితే నిజానికి అల్లాహ్ అతీతుడు తనకు తానే స్తుతిపాత్రుడు.

(దివ్య ఖుర్ఆన్ 31:12)

నేను చెప్పే ఈ విషయాలపై మనసుపెట్టి యోచించాలన్నదే నా అభ్యర్థన. ఈ జీవితం ఏదో ఒకరోజు అంతమవుతుంది. ఎవరి జీవితం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియదు. మనం ఎక్కడి నుండి వచ్చాము, ఎక్కడికి వెళ్లాలో కూడా తెలియదు. మమ్మల్ని ఈ ప్రపంచంలోకి పంపించిందెవరు? ఆ దైవం మా నుంచి ఏమి ఆశిస్తున్నాడు? అనే విషయాలన్ని ప్రవక్తలు చెబితేనే తెలుస్తోంది. వారు తీసుకొచ్చిన గ్రంథాలు చదివితేనే బోధపడుతుంది.

ఓ దైవమా! నీ మార్గానికి దారి చూపించు, మాకు సాయమందించు. (ఆమీన్, సుమ్మ ఆమీన్)